మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 8-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 71 Issue: 71

08 సెప్టెంబర్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:20 తిథి ద్వాదశి మ. 2:44 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పుష్యమి సా. 4:38 వరకు తరువాత ఆశ్లేష యోగం పరిఘ రా. 12:350 వరకు కరణం తైతుల మ. 2:44 వరకు గరజి రా. 1:360 వరకు వర్జ్యం తె. 4:41 నుండి ఉ. 6:11 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:22 వరకు రా. 11:03 నుండి రా. 11:50 వరకు రాహుకాలం మ. 3:17 నుండి సా. 4:49 వరకు యమగండం ఉ. 9:10 నుండి ఉ. 10:42 వరకు గుళికాకాలం మ. 12:13 నుండి మ. 1:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు ఉ. 10:40 నుండి మ. 12:09 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


# స్పీకర్‌ను తిట్టారని..



## అసెంబ్లీ వేదికగా ఆవేశాలు.. ప్రజా సమస్యలతో ఆటలు



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో అసెంబ్లీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు టీషర్టుల మీద నినాదాలు రాసుకురావడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. వారిని లోపలికి అనుమతించకపోవడంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.

## ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు

### అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కంటతడి.. మధుపై చర్యలకు సీఎం డిమాండ్

### స్పీకర్‌ను అనలేదు.. వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుంటున్నా తాతా మధు స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులతో తాతా మధుకు వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. తన ప్యాంటు లాగారని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ తాతా మధు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులను ఉద్దేశించి ఆయన అనుచితంగా మాట్లాడినట్లు కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు తనను అడ్డుకోవడంపై తాతా మధు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులను ఉద్దేశించి దురుసుగా మాట్లాడిన వీడియోలు, కామెంట్లు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి పోలీసుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరికాదని కాంగ్రెస్ నేతలు తరువాయి 2 వ పేజీలో...





# చీర లాగారని..

## అసెంబ్లీ వద్ద తోపులాట..తీవ్ర ఉద్రిక్తత

### బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం

### నల్ల టీషర్టులు ధరించి వచ్చిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

### మెయిన్ గేట్ వద్దే అడ్డుకున్న పోలీసులు

### అక్కడే బైఠాయించి బీఆర్ఎస్ నిరసన..నినాదాలు

### తోపులాటలో చీర లాగారని సునీతాలక్ష్మారెడ్డి కంటతడి

### హరీశ్, కేటీఆర్ తదితరు అరెస్టు.. తెలంగాణ భవన్‌కు తరలింపు

### బీఏసీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్న హరీశ్‌రావు

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద పోలీసులకు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు మధ్య తోపులాట జరిగింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ఈ ఘటనలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి కిందపడగా.. జగదీశ్‌రెడ్డి అస్వస్థతకు గురైనట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకోవడం ఏమిటని బీఆర్ఎస్ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నల్ల టీషర్టులపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉండటంతో పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు ప్రధాన గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి తరువాయి 2 వ పేజీలో...



## వారం పాటు అసెంబ్లీ సమావేశాలు

2



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,415 |
| వెండి (కిలో): | రూ.2,,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,454 |

# 12 మంది దుర్మరణం

### యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. బాఘ్‌పత్‌లో పికప్ వాహనం బోల్తా

### రాజస్థాన్ నుంచి బదౌన్ వెళ్తుండగా అర్ధరాత్రి ఘటన



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా తరువాయి 2 వ పేజీలో...



# ఫ్రాన్స్‌తో బంధం కొత్త శిఖరాలకు!

### సాంస్కృతిక, రాజకీయ సంబంధాలే పునాది.. నరేంద్ర మోదీ వెల్లడి

### వర్చువల్‌గా పారిస్‌లో స్వామినారాయణ ఆలయం ప్రారంభం

భారత్-ఫ్రాన్స్ సంబంధాలు కొత్త శిఖరాలను చేరుకున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఇరు దేశాల మధ్య బంధం కేవలం వ్యూహాత్మక భాగస్వామ్యానికే పరిమితం కాదని, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సాంస్కృతిక, రాజకీయ సంబంధాలే దానికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. పారిస్‌లోని స్వామినారాయణ ఆలయ ప్రారంభోత్సవంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు.

న్యూఢిల్లీ: ఇటీవలి సంవత్సరాల్లో భారత్-ఫ్రాన్స్ మధ్య సంబంధాలు కొత్త శిఖరాలను చేరుకున్నాయని చెప్పారు. "నా మిత్రుడు, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో కలిసి ఇరు దేశాలు ఒక ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మిస్తున్నాయి. సాంకేతికత, ఏఐ, రక్షణ రంగాల నుంచి అంతరిక్షం, వాతావరణ పరిరక్షణ వరకు ఇరు దేశాలు నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నాయి. మేము 2026ను భారత్-ఫ్రాన్స్ నూతన తరువాయి 2 వ పేజీలో...

# త్వరలో ఆటో చార్జీలు పెంపు

### కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం.. ఆర్టీసీ ఈవీ ఆటోలు నడిపే ప్రసక్తే లేదు

### ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ యాప్.. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలో త్వరలోనే ఆటో చార్జీలు పెరగనున్నాయి. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆటో కార్మికుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి కీలక సమావేశం నిర్వహించారు. ఆటో తరువాయి 2 వ పేజీలో...





## సర్ గడువు పొడిగింపు

### అక్టోబర్ 7 వరకు కొనసాగింపు

### నవంబర్ 9న ఓటర్ల తుది జాబితా

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణలో మరోసారి 'సర్' గడువును ఎన్నికల సంఘం పొడిగించింది. ఆఖరు తేదీ సమీపిస్తున్న వేళ ఓటరు జాబితాలో సవరణలు చేసుకునేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకూ అవకాశమిచ్చింది. సర్ నోటీసులకు ధ్రువపత్రాలను సమర్పించి -2 వ పేజీలో...

# గణేశ మండపాలకు పోర్టల్

### మండపాల వద్ద నిరంతర పర్యవేక్షణ.. డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ఎస్ఐలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): సెప్టెంబరు 14న ప్రారంభమయ్యే ఉత్సవాలు.. 25న గణేశ్ విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. గణేశ్ మండపాల వివరాలను సేకరించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చినట్లు డీజీపీ తెలిపారు. మండపం ఉన్న ప్రదేశం, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కృత్రిమ తీపి పదార్థాలు పేగుల్లోని సూక్ష్మజీవుల సమతుల్యతను మార్చి, శరీర జీవక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. సుక్రలోజ్, సాకరిన్, ఆస్పర్టేమ్, అసిసల్ఫేమ్ పొటాషియం వంటి పదార్థాలు చక్కెర, కేలరీలను తగ్గించేందుకు ఉపయోగిస్తున్నప్పటికీ.. ఇవి పూర్తిగా జీవశాస్త్రపరంగా క్రియారహితమైనవి కావని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.పేగుల్లోని సూక్ష్మజీవులు ఆహార జీర్ణక్రియ, విటమిన్ల ఉత్పత్తి, వాపు నియంత్రణ, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. కృత్రిమ తీపి పదార్థాలు వీటి సమతుల్యతను మార్చడం ద్వారా ప్రయోజనకరమైన కొవ్వు ఆమ్లాల ఉత్పత్తి, రోగనిరోధక వ్యవస్థతో పేగుల సంబంధం, గ్లూకోజ్ నియంత్రణపై ప్రభావం చూపుతాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.



# నీలకురింజి.. వికసించింది!

కేరళలోనిమున్నార్‌లో పర్యాటకులను కట్టిపడేసే అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అరుదైన 'నీలకురింజి' పూలు వికసించాయి. మట్టుపెట్టి సమీపంలోని కొరండకాడు కొండలపై పర్పుల్-బ్లూ రంగులో కనువిందు చేస్తున్న ఈ పూల అందాలను చూసేం దుకు ప్రకృతి ప్రేమికులు క్యూ కడుతున్నా రు. సాధారణ పూల మాదిరిగా నీలకురింజి పూలు ప్రతి ఏటా పూయవు. ఇవి పన్నెండేళ్లకు ఒక్కసారి మాత్రమే వికసిస్తాయి. ప్రస్తుతం దేవికుళం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మట్టుపెట్టి, చొక్కరముడి, కొరం డకాడు కొండల నిండా ఈ పూలు గుబాళి స్తున్నాయి. ఆగస్టు చివర్లో మొదలైన వికాసం.. సెప్టెంబర్ మొత్తం కనువిందు చేస్తుంది. మళ్లీ 2038 వరకు ఈ పూల వికాసం కోసం ఎదురుచూడక తప్పదు.



## నేడు, రేపు టీజీ టెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణత పొందని ఇన్ సర్వీస్ టీచర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టెట్ పరీక్ష నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే ఈ అర్హత పరీక్షకు 24,986 మంది టీచర్లు హాజరు కానున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు

# రాశి ఫలాలు

8.9.2026

మేషం: దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన పనులు అనుకూలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు.

వృషభం: కుటుంబ పెద్దలతో ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

మిధునం: వాహన అనుకూలత కలుగుతుంది. ప్రముఖుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి.నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. సంఘంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి.

కర్కాటకం: నిరుద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి.

సింహం: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. సన్నిహితులు, మిత్రుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి.

కన్య: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. బంధువులతో స్వల్ప విభేదాలు తప్పవు. సహనంతో కానీ కొన్ని పనులు పూర్తి కావు. వ్యాపారాలు, ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి.

తుల: ముఖ్యమైన పనులలో  విజయం సాధిస్తారు. గృహమునకు చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది.

వృశ్చికం: ఆర్థిక పరంగా ఒత్తిడులు తప్పవు. కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం తప్పదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.  బంధు మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

మకరం: చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. సన్నిహితుల నుంచి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు.

కుంభం: దీర్ఘకాలిక ఋణాలు నుండి బయటపడగలుగుతారు. చేపట్టిన వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

మీనం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.



# చీర లాగారని..

మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి చేరుకున్నారు. 'హామీల అమల్లో కాంగ్రెస్ వైఫల్యం.. వెయ్యి రోజుల పాలన నిష్ఫలం' అనే నినాదాలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి వారు అసెంబ్లీ ప్రధాన గేటు వద్దకు వచ్చారు. పోలీసులు లోనికి అనుమతించకపోవడంతో అక్కడే నిరసనకు దిగారు. అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. ఆగ్రహానికి గురైన హరీశ్‌రావు తన నల్ల టీషర్టును విప్పి పక్కకు విసిరేశారు. టీషర్టుపై ఎలాంటి నినాదాలు లేనందున తనను అసెంబ్లీలోకి అనుమతించాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి కూడా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. అనంతరం హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పోలీసులు వాహనంలో తెలంగాణ భవన్‌కు తరలించారు.

మహిళా ఎమ్మెల్యేల ఆరోపణలు

పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురికి స్వల్ప గాయాలైనట్లు బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. జగదీశ్‌రెడ్డి అస్వస్థతకు గురికావడంతో తోటి ఎమ్మెల్యేలు సపర్యలు చేశారు. కేటీఆర్‌ను పోలీసులు బలవంతంగా వాహనంలోకి ఎక్కించారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తన జుట్టు పట్టుకుని, గొంతు నొక్కారని సబిత ఆరోపించగా.. తన చీర లాగారని సునీతా లక్ష్మారెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం సబిత, సునీత, కోవా లక్ష్మితో పాటు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాధవరం కృష్ణారావు తదితరులు గేటు వద్ద బైఠాయించగా వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బీఆర్‌ఎస్ తెలిపింది. పోలీసుల తీరుపై బీఆర్‌ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సభలో అడుగు పెట్టకముందే తమను అడ్డుకోవడం, ప్రజాప్రతినిధులపై పోలీసులు బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారంటూ ఆరోపిస్తూ 'ఇది శాసనసభా? కౌరవసభా?' అని ప్రశ్నించింది. తమపై జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని, హోంశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఈ ఘటనపై క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశాన్ని కూడా ఆ పార్టీ బహిష్కరించింది.

# స్పీకర్‌ను తిట్టారని..

మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. ఇదే సమయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కూడా ఎమ్మెల్సీ తాతా మధు తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు అధికార పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

## స్పీకర్ కంటతడి

స్పీకర్ చైర్‌లో ఉండగానే తీవ్ర భావోద్వేగానికి గురైన గడ్డం ప్రసాద్ కుమార్ కంటతడి పెట్టారు. ఉదయం అసెంబ్లీ వెలుపల బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై మధ్యాహ్నం సభలో చర్చ జరిగింది. స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కీలక వ్యాఖ్యలు చేశారు. సభాపతికి జరిగిన అవమానం కేవలం వ్యక్తిగత అవమానం కాదని, మొత్తం సభ్య సమాజానికి జరిగిన అవమానమని అన్నారు. స్పీకర్‌ను ఉద్దేశించి ఉపయోగించిన భాష అభ్యంతరకరంగా ఉందని పేర్కొంటూ.. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాసనమండలి సభ్యుడిగా కొనసాగేందుకు ఆయనకు అర్హత లేదని, సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీఎం కోరారు. ఇటువంటి చర్యలు గతంలో ఎప్పుడూ జరగలేదని.. ఇంత దుర్మార్గంగా స్పీకర్ తల్లిని అవమానించటం దారుణమన్నారు. స్పీకర్ పట్ల ఇంత అభ్యంతరకరంగా మాట్లాడిన వ్యక్తిపై కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ఈ ఘటనపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా స్పందించారు. స్పీకర్‌పై అనుచిత, అసభ్యకర భాషను ఉపయోగించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. శాసనసభ, శాసనమండలి వంటి ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఉన్నత పదవుల్లో ఉన్నవారిపై వ్యక్తిగత దూషణలకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. తాతా మధుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్చ కొనసాగుతున్న సమయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తనపై, తన కుటుంబ సభ్యులపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన కన్నీరు పెట్టుకోవటంతో సభలో ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. స్పీకర్ భావోద్వేగానికి గురైన దృశ్యాలు సభలోని సభ్యులను సైతం కలచివేశాయి. మంత్రి సీతక్క ఈ అంశంపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ కుటుంబ సభ్యులను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ఆమె అన్నారు. ఒక వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో కూర్చోవడానికి కారణమైన కుటుంబ నేపథ్యాన్ని అవమానించడం సరికాదని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తులు ఉన్నత పదవుల్లోకి రావడాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని సీతక్క ఆరోపించారు. సభలోని సభ్యులందరినీ సమానంగా గౌరవించే స్పీకర్ కుటుంబంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయడంతోపాటు, అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష నేత, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సైతం క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తాతా మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు.  ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. "పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు.

## 12 మంది దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నేడు, రేపు టీజీ టెట్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 66 వేల మంది టీచర్ల దాకా టెట్ క్వాలిఫై కాలేదు. ఈ క్రమంలో 2026 జనవరి, జూన్ నెలల్లో నిర్వహించిన టెట్ పరీక్షల్లో 38 వేల మంది వరకు అర్హత సాధించారు. ఇంకా 28 వేల మంది దాకా టెట్ ఉత్తీర్ణత పొందలేదు. ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే టెట్‌కు 13 జిల్లాల్లో 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. టెట్ పేపర్-1కు 5,964 మంది, పేపర్-2కు 19,022 మంది హాజరు కానున్నారు.

## త్వరలో ఆటో చార్జీలు పెంపు

మొదటి పేజీ తరువాయి

డ్రైవర్లు, కార్మిక సంఘాలు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకురాగా.. ఆయా అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులు సుదీర్ఘంగా చర్చించారు. గత ఆగస్టు 23న జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షించారు. టీజీఎస్‌ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి విధానంపై ఎలాంటి చర్చ జరగడం లేదన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కార్మిక శాఖతో కలిసి ప్రాధాన్యతా ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి శాసనసభలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 2012 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆటో చార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రవాణా శాఖ అధికారులు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని చెప్పారు. ఎంత మేర చార్జీలు పెంచాలనే అంశాన్ని కమిటీ నిర్ణయించి ప్రభుత్వానికి సూచనలు చేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా త్వరలో చార్జీల పెంపును అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

## వారం పాటు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వారం పాటు నిర్వహించాలని శాసనసభా వ్యవహారాల సంఘం నిర్ణయించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు బీఏసీ ఆమోదం తెలిపింది. 22ఏపై జ్యుడీషియల్ విచారణ చేయాలని బీజేపీ పట్టుబట్టింది. దీంతో పాటు 25 అంశాలపై చర్చించాలని బీజేపీ కోరింది. సమావేశాల పొడిగింపుపై మరోసారి బీఏసీ భేటీ కానుంది.

## గణేశ్ మండపాలకు పోర్టల్

మొదటి పేజీ తరువాయి

నిమజ్జనానికి వినియోగించే వాహనాల వివరాలను అందులో నమోదు చేయాలి. ఎస్‌హెచ్‌వోలకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చినందున మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. సీపీలు, డీసీపీలు, ఎస్పీలు మండపాలను సందర్శించి పాయింట్ బుక్స్‌లో పరిశీలన వివరాలు నమోదు చేయాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్తు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ ఆదేశించారు. విద్యుత్తు, అగ్నిమాపక తదితర శాఖలతో సమన్వయం చేసుకోవాలి. మండపాల వద్ద నిర్వాహకులు స్వచ్ఛంద కార్యకర్తలను ఏర్పాటు చేసుకునేలా చూడడంతోపాటు సీసీ కెమెరాలు, క్యూల నిర్వహణకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేశ్  నిమజ్జనానికి సంబంధించి మార్గాలు, రహదారులు, వంతెనలను ముందుగానే గుర్తించి వాటి సామర్థ్యాన్ని పరిశీలించాలని డీజీపీ సూచించారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేయాలి. భద్రతా చర్యల్లో భాగంగా బాంబు డిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను అవసరమైన చోట వినియోగించాలని ఆదేశించారు. మండపాల ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేసి భద్రతా ఏర్పాట్ల వివరాలను నమోదు చేయాలని డీజీపీ సూచించారు. జియో ట్యాగింగ్, తనిఖీల వివరాలను టీజీ-కాప్ ప్లాట్‌ఫాంలోనూ అప్‌లోడ్ చేయాల న్నారు. గణేశ్ ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను ముందుగానే పరిష్కరించాలని డీజీపీ తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించాలి. సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై తక్షణమే స్పందించాలని సూచించారు. అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు, ప్రజల సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సమావేశంలో డీజీ టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాసరావు, ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, ఐజీ మల్టిజోన్-1 చంద్రశేఖర్‌రెడ్డి, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, ఏఐజీ రమణకుమార్, హైదరాబాద్ డీసీపీ అవినాష్‌కుమార్, డీసీపీ విక్రాంత్‌కుమార్ సింగ్‌తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫ్రాన్స్‌తో బంధం కొత్త శిఖరాలకు!

మొదటి పేజీ తరువాయి

ఆవిష్కరణల సంవత్సరంగా కూడా జరుపుకుంటున్నాము. ఈ వ్యూహాత్మ భాగస్వామ్యం చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది మన సుదీర్ఘ సాంస్కృతిక, రాజకీయ సంబంధాల పటిష్టమైన పునాదిపై ఆధారపడి ఉంది. ప్రస్తుతం రెండు దేశాల జాయింట్ వెంచర్ అవకాశాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. వివిధ సందర్భాల్లో ఫ్రాన్స్‌లో భారత సైనికుల త్యాగాలు నేటికీ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నాయని చరిత్ర చెబుతోంది" అని ప్రధాని చెప్పుకొచ్చారు. భారత్, ఫ్రాన్స్ మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. సంస్కృత భాష ప్రాచుర్యంలో ఫ్రాన్స్ విద్వాంసులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందలపై రోమెయిన్ రోలాండ్ రాసిన రచనలు మన సమాజాలను మరింత దగ్గర చేశాయని పేర్కొన్నారు. పారిస్ నుంచి పుదుచ్చేరిలోని శ్రీ అరవిందో ఆశ్రమానికి 'ది మదర్' సాగించిన ఆధ్యాత్మిక యాత్ర ఇరు దేశాలకు చెందిన ఆధ్యాత్మిక సాధకులను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. అలాగే దశాబ్దాల క్రితం శ్రీల ప్రభుపాద స్వామి కూడా ఫ్రాన్స్‌ను సందర్శించి ఇస్కాన్ ద్వారా ఇరు దేశాల ఆధ్యాత్మిక సంబంధాల్లో ఒక కొత్త అధ్యాయానికి తెరతీశారని గుర్తుచేశారు. ప్రస్తుతం యోగా కూడా ఇరు దేశాల ప్రజల మధ్య అనుబంధానికి వారధిగా మారిందని ప్రధాని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈఫిల్ టవర్ వద్ద కనిపించే దృశ్యాలే ఫ్రాన్స్‌లో యోగాకు ఉన్న విశేష ప్రజాదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. పారిస్‌లో నిర్మించిన సరికొత్త స్వామినారాయణ ఆలయం కొత్త అవకాశాలకు ద్వారాలు తెరిచిందని ప్రధాని చెప్పారు. ఇది అచ్చంగా 'మేడ్ ఇన్ ఇండియా-బిల్ట్ ఇన్ ఫ్రాన్స్' శైలిలో రూపుదిద్దుకుందని తెలిపారు. "ఈ ఆలయానికి సంబంధించిన అనేక శిల్పాలను భారత్‌లోనే చెక్కారు. ఇది భారత్ ప్రాచీన శిల్పకళను, ఫ్రాన్స్ ఆధునిక ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని అద్భుతంగా మేళవిస్తుంది" అని ఆయన ప్రధాని కొనియాడారు. పారిస్‌లో నూతనంగా నిర్మించిన ఈ ఆలయం నుంచి వెలువడే భారతీయ సంస్కృతి విలువలు యూరప్ అంతటా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తనకు సమయం కుదిరినప్పుడు తప్పకుండా ఈ ఆలయాన్ని సందర్శిస్తానని ప్రధాని వెల్లడించారు. స్వామినారాయణ ఆలయాలు సాధారణంగా భక్తితో పాటు సేవా కార్యక్రమాలకు కూడా కేంద్రాలుగా నిలుస్తాయని ప్రధాని చెప్పుకొచ్చారు. పారిస్‌లోని ఈ నూతన ఆలయం కూడా భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలకు వేదికగా మారుతుందని పేర్కొన్నారు.

## సర్ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

తమ ఓటును కాపాడుకునేందుకు ఈ గడువు ఇచ్చింది. నవంబర్ 9వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని ఈసీ వెల్లడించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల అధికారి ఓ ప్రకటన విడుదల చేశారు. ఓటర్ జాబితాలో పేరున్నా.. సర్ నోటీసులు అందుకున్న వారికి ఎన్నికల సంఘం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో మరోసారి సర్ గడువును పొడిగించింది ఈసీ. సర్ నోటీసులు, అభ్యంతరాల స్వీకరణ, బీఎల్‌వోలకు ధ్రువపత్రాల సమర్పణలో జాప్యం జరుగుతున్నందున తుది గడువును అక్టోబర్ 7వ తేదీ వరకూ పెంచింది. సర్ నోటీసులు, ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణకు నవంబర్ 5వ తేదీ వరకు సమయమిచ్చింది. నవంబర్ 9వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది.



## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**పోలీసులకు హైకోర్టు ఆదేశాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## యూట్యూబర్ నందన అరెస్ట్

శంషాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే: కోమటిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22-ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో సభాప్రాంగణంలోకి దూసుకెళ్లారు. స్పీకర్ కల్పించుకుని... బీఏసీ సమావేశంలో చర్చించి 22-ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. మరోవైపు, బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. మరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22-ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## 20 జిల్లాలకు వాన అలర్ట్

**హైదరాబాద్ సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలో వర్షాలు మళ్లీ పుంజుకున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన చేస్తూ.. రాజధాని సహా ఆరు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్', మరో 14 జిల్లాలకు 'యెల్లో అలర్ట్' జారీ చేసింది. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడ్చల్, నల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతోంది.

## పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

విజయవాడ, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఇది దుశ్శాసన సభ

**మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?.. సీఎం, పోలీసులపై కేటీఆర్ మండిపాటు**



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా సీఎం రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపించారు.

## చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): అసెంబ్లీ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

**బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా**

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్**

**సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో సోమవారం రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## శ్రీవారి సేవలో యోగి ఆదిత్యనాథ్

తిరుమల, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్-సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

**మీరిచ్చే ప్రతి పైసా..**
**ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బీడీ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 4(ఈవార్తలు): బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు బీడీ కార్మికుల సంక్షేమ సంస్థ అధికారులు తెలిపారు. అర్హత కలిగిన బీడీ కార్మికుల పిల్లలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల కోసం జాతీయ ఉపకార వేతనాల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని, వివరాలను సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఉపకార వేతనాలకు సంబంధించిన పూర్తి వివరాలను జాతీయ ఉపకార వేతనాల పోర్టల్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తికి 0120-6619540 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## రెడ్లు, కమ్మలే సీఎం కావాలా?

**అన్ని వర్గాలకు సమాన అవకాశాలు**

**దసరా రోజున కొత్త పార్టీ ప్రకటన**

**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడి**



విజయవాడ, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

# గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం

## పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం.. ధర్మపురి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు

**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

ధర్మపురి, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం తెల్లవారుజామున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు మంత్రులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఉగ్ర నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంలో వారి ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని తెలిపారు. 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ప్రముఖ ఆలయాల అభివృద్ధితో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పుష్కరాల అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి సుమారు రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించగా.. వాటికి ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మపురి



మండలం తిమ్మాపూర్ గ్రామంలో రూ.2.48 కోట్లతో నిర్మించనున్న నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.22.16 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో రూ.58.55 కోట్లతో నిర్మించనున్న తొమ్మిది రోడ్ల పనులకు కూడా భూమిపూజ చేశారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గానికి ఇప్పటికే రూ.117 కోట్లు విడుదల చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తాజాగా మరో రూ.80 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ధర్మపురి నియోజకవర్గంలో గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు కేటాయించే నిధులు సుమారు రూ.200 కోట్లకు చేరనున్నాయని తెలిపారు.

## వెయ్యి రోజుల పాలన ప్రగతికి దిశ

**మేడ్చల్ డీసీసీ కార్యదర్శి వినయ్**



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తెలంగాణను సంక్షేమం, సామాజిక న్యాయం, వ్యవసాయం, విద్య, వైద్యం, ఉద్యోగాలు, పెట్టుబడులు, మౌలిక వసతులు, సాంకేతిక రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని మేడ్చల్ జిల్లా డీసీసీ కార్యదర్శి కె.వినయ్ ముదిరాజ్ అన్నారు. రైతు సంక్షేమంలో భాగంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. వ్యవసాయం, రైతు సంక్షేమానికి సుమారు రూ.1.68 లక్షల కోట్లు కేటాయించడంతో పాటు 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. కొత్తగా 15 లక్షలకు పైగా రేషన్ కార్డులు మంజూరు చేసి పేదలకు ఆహార భద్రత కల్పిస్తున్నామని, కొత్త పింఛన్లతో సామాజిక భద్రతను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, అర్హులైన కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో లక్ష బహుళ అంతస్తుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

మల్యాల, సెప్టెంబర్ (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివ రామకృష్ణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న శివ రామకృష్ణను సర్పంచ్ బొట్ల జయ-ప్రసాద్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం మల్యాల మండలానికి గర్వకారణమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న శివ రామకృష్ణకు అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ విద్యారంగంలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.



## బొల్లారం విద్యార్థులకు క్రీడా దుస్తులు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): బొల్లారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆదర్శ వెల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సందేసరి సౌజన్య మల్లికార్జున్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పార్టీలకు అతీతంగా బొల్లారం గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## రాజన్న ఆలయానికి 1.03 లక్షల విరాళం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనుల కోసం హనుమకొండకు చెందిన డాక్టర్ చందన, అనిల్‌కుమార్‌రెడ్డి దంపతులు రూ.1,03,250 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్‌కుమార్‌కు నగదును అందించారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను శేషవస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పురాణం వంశీమోహన్ శర్మ, అకౌంట్స్ అడ్వైజర్ ఆగమరావు తదితరులు పాల్గొన్నారు. వివరాలను ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ తెలిపారు.



## తొలి జీతం రాజన్న సేవకు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనుల కోసం నిజామాబాద్‌కు చెందిన భక్తురాలు జక్కుల రుచిత రూ.26,730 విరాళంగా అందజేశారు. ఉద్యోగం పొందిన సందర్భంగా తన తొలి జీతం నుంచి ఈ మొత్తాన్ని స్వామివారి సేవకు సమర్పించారు. ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ఏఈవో లక్ష్మణరావు, పీఆర్వో పెరిక శ్రీనివాస్‌లకు రుచిత తన తల్లిదండ్రులు జె.రవీందర్, మీనాతో కలిసి విరాళాన్ని అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

# సీనన్నా.. నీ దయచూపన్నా!

### నిరుపేద కుటుంబంపై అధికారుల నిర్లక్ష్యం.. మంత్రి పొంగులేటి చొరవ తీసుకోవాలి

### అభాగ్యుల సమస్యను పరిష్కరించాలి.. స్థానికులు, మానవతా వాదుల విజ్ఞప్తి

ఇల్లందు/ కారేపల్లి, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ప్రభుత్వాలెన్ని మారినా.. ఆంధ్ర ఆధిపత్య నాయకత్వంతో కొట్లాడి సొంతంగా తెలంగాణ రాష్ట్రం సాధించుకుని సొంతింటి ప్రభుత్వం కొలువు దీరినా అభాగ్యుల బతుకుల్లో కాసింత కూడా వెలుగు కానరాని పరిస్థితి నెలకొంది. దశాబ్ద కాలానికి పైగా కొట్లాడి..గోసపడి సాధించుకున్న సొంత రాష్ట్రంలో ఆడబడుచులకు ఇంటి ముంగిట్లోకి తాగునీరు సరఫరా చేసేందుకు గొప్పగా అమలు చేసిన మిషన్ భగీరథ.. రాష్ట్రంలో ధ్వంసమైన చెరువుల పరిరక్షణకు మిషన్ కాకతీయ పథకం ఓ కుటుంబాన్ని అభాగ్యుల్ని చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ప్రస్తుతం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం రాగబోయిన గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని తెలగ గుంపు (తంగెళ్లగడ్డ)లో ఓ కుటుంబం దయనీయ పరిస్థితి ఇది. అందునా ఆ కుటుంబ సభ్యులంతా సాక్షికంగా, పూర్తిగా కంటి చూపు లేని నిరుపేదలు. మిషన్ కాకతీయలో వారి సాగుభూమంతా చెరువులో మునిగిపోయినా పట్టించుకునే నాథుడే లేడంటే అతిశయోక్తి కాదు. అసలే దివ్యాంగులు.. దాదాపు 4 ఎకరాల సాగు భూమి చెరువులో మునిగి పోయాక తినడానికి గాసం లేక ఆ కుటుంబం పడుతున్న కష్టాలు తనివి తీరా చూడాల్సిందే కానీ.. చెప్పనలవి కాదు. మిషన్ కాకతీయ కింద భూమిని స్వాధీనం చేసుకున్న ఎమ్మార్వో, ఇతర రెవెన్యూ అధికారులు భూమి లెక్కలు పక్కాగా చూసి పరిహారం చెల్లించి.. ఈ అభాగ్య కుటుంబం కన్నీళ్లు తుడిచేందుకు ఎంత మాత్రమూ పని చేయలేదన్నది నిష్ఠూర సత్యం. పాలకులెవరైనా ప్రతి రోజూ అధికారిక సమీక్షలు.. సామాన్యులకు అన్యాయం జరక్కుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తుంటారు. ప్రజల ముంగిట్లోకే పాలన



తీసుకొచ్చాం అని ఊరూవాడా ఢంకా బజాయించి చెప్పుకునే అధినేతలు క్షేత్రస్థాయిలో సామాన్యుల పరిస్థితి ఎలా ఉందని కనీసం తొంగి చూసేందుకు సాహసించరంటే అతిశయోక్తి కాదు. గత ప్రభుత్వం రైతు చనిపోతే ఆ రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతు బీమా కింద రూ.5 లక్షలు అందిస్తూ వచ్చింది. కానీ, ఈ కుటుంబ యజమాని చనిపోతే వయస్సు ఎక్కువైంది కనుక రైతు బీమా రాదు అని రెవెన్యూ యంత్రాంగం దాటవేసింది. అంతకు ముందు సామాజిక పెన్షన్ కోసం దరఖాస్తు చేస్తే వయస్సు తక్కువ కనుక పెన్షన్ రాదని వింత సమాధానాలిచ్చారు ఘనత వహించిన రెవెన్యూ యంత్రాంగం. 2014కు ముందు రూ.500 గా ఉన్న పెన్షన్ తర్వాత రూ.1,000 వృద్ధులకు ఇస్తే తర్వాత రూ.2,000 పెరిగింది. ఇంట్లో అందరూ వికలాంగులే కనుక వారికి వికలాంగుల పెన్షన్ రావాల్సి ఉంది. ప్రస్తుతం సామాజిక పెన్షన్లపైనే ఆధార పడి జీవిస్తున్న ఈ కుటుంబం ఆదుకునే వారు లేక అల్లాడిపోతోంది. ఎవరైనా విషయం తెలిసి పలకరించడానికి వెళితే తమ బాధ కూడా చెప్పుకోలేని విపత్కర పరిస్థితుల్లో ఉన్నారీ కుటుంబ సభ్యులు. ప్రభుత్వ పథకం కింద ఇల్లు వచ్చిందని చెబుతున్నా.. వారు ఉంటున్న ఇల్లు ప్లాస్టింగ్ చేయక .. వర్షాలొచ్చినప్పుడు కురుస్తోంది. చలి కాలంలో చలి కూడా అధికమే. ఈ విషయం మీడియా ద్వారా తెలియడంతో గతంలో కారేపల్లి మండలం చీమలపాడులో పని చేసి.. తాజాగా రిటైరైన ఉపాధ్యాయుడు ఉపేందర్ రెడ్డి గారూ ఆ కుటుంబానికి అండగా నిలిచారు. దాదాపుగా నెలవారీగా భారీ మొత్తంలో తనకు తెలిసిన వారి ద్వారా పంపి.. ఆ కుటుంబాన్ని ఆదుకుంటున్నారు. ఆ నలుగురిలో ఒకరికి నేత్ర చికిత్స చేస్తే కంటి చూపు వస్తుందని వైద్యులు చెప్పారు. ఆ ఒక్కరికీ కంటి చూపు వస్తే మొత్తం కుటుంబానికి ఆసరాగా ఉంటుందని..హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో వైద్యం చేయించడానికి కూడా రిటైర్డ్ టీచర్ సిద్ధంగా ఉన్నారు.. హైదరాబాద్‌కు తీసుకెళ్లే వారు లేక ఇంటికే పరిమితమై.. రేషన్ కార్డుపై వచ్చే బియ్యం వండుకుంటూ.. తమకు వచ్చే సామాజిక పెన్షన్లతో జీవనం సాగిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడంతోపాటు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిగా పని చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించాలని స్థానికులు, మానవతా వాదులు కోరుతున్నారు. సమస్య తెలుసుకుని స్పందించడంలో ముందుండే రాష్ట్ర రెవెన్యూ, సమాచార, ప్రసారాలు, గృహ నిర్మాణశాఖల మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి కాస్త నజర్ తమ అభాగ్య కుటుంబంపై ప్రసరింపజేసి.. వారిని ఆదుకునేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## శ్రీరామోజు శ్రీనివాస్‌కు ఉత్తమ అవార్డు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): నమిలిగుండుపల్లి గ్రామంలోని కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరామోజు శ్రీనివాస్ వేములవాడ రూరల్ మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో భాగంగా ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ అబూబకర్, ఎంఈవో కిషన్ అవార్డును అందజేసి శ్రీరామోజు శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారిని ఉన్నత స్థానాల్లో నిలబెట్టడమే తన లక్ష్యమని తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన విద్యాశాఖ అధికారులకు, పాఠశాల సిబ్బందికి, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరు గ్యారంటీలపై గులాబీ నిరసన

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వేములవాడ పట్టణ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం ఆందోళన చేపట్టాయి. పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించి స్థానిక ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 420 హామీలతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. కాలయాపనకు స్వస్తి చెప్పి ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ బీఆర్ఎస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నిమ్మశెట్టి విజయ్, గోస్కుల రవి, రామతీర్థపు రాజు, ఆకుల దేవరాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజన్న భక్తులకు విశ్రాంత ఉద్యోగి సేవ



వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరగడంతో భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆలయ విశ్రాంత ఉద్యోగి ద్వారక శేఖర్, ఆయన సతీమణి శ్రీదేవి 2 వేల మినరల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కోడె మొక్కుల క్యూ లైన్‌లో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు మైవేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకుడు మధు మహేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మరింత మంది దాతలు ట్రస్టుతో కలిసి సేవా కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ద్వారక శేఖర్, ఆలయ ఉద్యోగి రాం కిషన్‌రావు, ట్రస్టు సభ్యులు మధు, కవిత, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్లలో ప్రార్థనా మందిరాలేంది?

**ప్రజావాణిలో స్థానికుల ఫిర్యాదు**

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు విద్యానగర్ కాలనీ, దానిమ్మతోట ప్రాంతంలో ప్రార్థనా మందిరం నిర్మాణంపై కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 1389లోని ప్లాట్ నంబర్ 92లో ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని అందుకు భిన్నంగా నిర్మాణం చేపట్టినట్లు ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 60 మంది కాలనీవాసులు వ్యక్తిగతంగా ఫిర్యాదులు సమర్పించినట్లు తెలిపారు. నిర్మాణ అనుమతులు, భవన వినియోగం, స్థానిక నిబంధనల అమలుపై సమగ్రంగా విచారణ జరపాలని కోరారు. ప్రార్థనా మందిరం నుంచి వెలువడుతున్న శబ్దంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణానికి మంజూరైన అనుమతులకు అనుగుణంగా భవనం నిర్మించారా? భవన వినియోగ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులను పరిశీలించిన కలెక్టర్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. కార్యక్రమంలో పల్లె శ్యాంసుందర్‌రెడ్డి, గడప కిషోర్‌రావు, నరసయ్య, వెంకట్రావుతో పాటు పలువురు మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రోల్లవాగు అనుమతులపై నజర్

**పీసీసీఎఫ్‌తో ఎమ్మెల్యే సంజయ్ భేటీ**

జగిత్యాల, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): అటవీ శాఖ అత్యున్నత అధికారి పీసీసీఎఫ్ వినయ్‌కుమార్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రోల్లవాగు ప్రాజెక్టుకు అటవీ అనుమతుల మంజూరు అంశంపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పీసీసీఎఫ్ వినయ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ, డీఎఫ్ఓలతో జూమ్ సమావేశంలో పాల్గొని అటవీ అనుమతుల అంశంపై చర్చించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన మరో సమావేశం నిర్వహించి స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారని అన్నారు. రోల్లవాగు ప్రాజెక్టుకు అటవీ అనుమతులు అతి త్వరలో మంజూరయ్యేలా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ తెలిపారు.

### చలో అసెంబ్లీకి పిలుపు..

## ముందస్తు అరెస్టులు

కొడిమ్యాల, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): ఫీజుల బకాయిల పరిష్కారం కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కొడిమ్యాల మండల బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండల బీజేవైఎం అధ్యక్షుడు గోనెపెల్లి ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడు పొన్నం అజయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి అనిల్ యాదవ్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఫీజుల బకాయిల సమస్యను పరిష్కరించాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## 420 హామీలు అమలు చేయాలి: నవీన్ పటేల్



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీన్ పటేల్ ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాగంటి సునీత గోపీనాథ్ ఆదేశాల మేరకు సోమవారం యూసఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్ ఏ.అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ పటేల్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ దరఖాస్తులకు గడువు పెంచాలి

కరీంనగర్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వ్యవస్థ సక్రమంగా పనిచేయక అర్హులైన నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ వీర మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తికాకముందే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడం సరికాదని పేర్కొంటూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జనసేన నాయకుడు కాస రాజు, జిల్లా వీర మహిళా విభాగం నాయకురాలు రాగుల శిరీష ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి వెబ్‌సైట్ సర్వర్, సాంకేతిక సమస్యలతో సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. దీంతో ఎంతోమంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించలేకపోయారని పేర్కొన్నారు. సాంకేతిక లోపాలకు నిరుద్యోగులను బాధ్యులను చేయడం సరికాదని, ప్రస్తుతం కొనసాగుతున్న వెరిఫికేషన్‌ను నిలిపివేసి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దరఖాస్తుల సమర్పణకు మరికొంత సమయం ఇచ్చి, అనంతరం అందరికీ సమాన అవకాశం కల్పిస్తూ పారదర్శకంగా ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కందుల రాజిరెడ్డి, వీర్ల శ్రీనివాసరావు, పొన్నాల తిరుపతి, శకుంతల, మహాదేవుని రాజకుమార్, పుప్పాల అన్వేష్‌రెడ్డి, జంగ మహేష్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.




## కానిస్టేబుల్ విజయ్‌కు అంబేద్కర్ అవార్డు

జగిత్యాల, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): సామాజిక సేవలో విశేషంగా కృషి చేస్తున్న జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నల్లాల విజయ్‌కుమార్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన లూసియానా రిసెర్చ్ యూనివర్సిటీ 2026 సంవత్సరానికి సామాజిక సేవా విభాగంలో అందించే అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. పుణేలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు విజయ్‌కుమార్‌ను మెమెంటో, మెడల్, షీల్డుతో సత్కరించారు. నిరుపేద యువతకు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సొంత ఖర్చుతో కోచింగ్ ఇప్పించి నలుగురికి ఉద్యోగాలు సాధించడంలో సహకరించారు. విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేయడంతోపాటు యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు క్రీడల వైపు మళ్లించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, రహదారుల మరమ్మతులు, మూఢనమ్మకాల నిర్మూలన, విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విజయ్‌కుమార్‌ను టౌన్ సీఐ కరుణాకర్, పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజలు అభినందించారు.

## ఓవర్‌లోడ్ లారీలపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): .జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఓవర్‌లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న లారీలు, డీసీఎంలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని మహమ్మద్కు వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో వాహనాలను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓవర్‌లోడ్ వాహనాల వల్ల రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రమాదాల ముప్పు పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మెల శివ, షేక్ సాజిద్, మాటేరి రంజిత్, స్వామి, మల్లేష్, శ్రీనివాస్, సైఫుద్దీన్, రాము, సంజయ్, అశోక్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో
## రూ.100 కోట్ల ప్రభుత్వ ఆస్తి కబ్జా

**10 నెలలుగా చర్యలు లేవు.. కలెక్టరేట్‌లో జీవన్‌రెడ్డి వినతిపత్రం**

జగిత్యాల, సెప్టెంబర్ 7 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ పార్టీ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడాన్ని నిరసించారు. కలెక్టరేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేసి అసెంబ్లీ సమావేశాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆలోచన మేరకు, కేటీఆర్ దిశానిర్దేశంతో ఐదు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000, బీడీ కార్మికులకు పెన్షన్ వంటి హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. జగిత్యాలలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు విఫలమయ్యారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటుకు టెండర్ లేకుండా సుమారు రూ.100 కోట్ల విలువైన స్థలాన్ని ఐఓసీకి అప్పగించారని ఆరోపించారు. చారిత్రక భవనాన్ని ప్రభుత్వ అనుమతి లేకుండా కూల్చివేశారని, నెలకు రూ.25 వేల అద్దె వచ్చే మున్సిపల్ దుకాణాలను రూ.12 వేలకే అప్పగించారని అన్నారు. పెట్రోల్ బంక్ పేరుతో 20 గుంటల మున్సిపల్ స్థలాన్ని తీసుకుని నాలుగు గుంటల్లో మాత్రమే బంక్ ఏర్పాటు చేసి, మిగిలిన 16 గుంటల స్థలం అన్యాక్రాంతమైందని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చి 10 నెలలు గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కొత్త బస్టాండ్‌లోనూ ప్రభుత్వ ఆస్తిని పెట్రోల్ బంక్ పేరుతో కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చల్గల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పక్కనపెట్టి వివక్ష చూపుతున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. తాటిపల్లి గుట్టల్లో అక్రమ తవ్వకాలు, తిమ్మాపూర్ ముప్పారపు చెరువు కబ్జాపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. ప్రకృతి వనరులను కాపాడాలని, అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావసంతా సురేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి దేవేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మల్లేశం, చల్గల్ సర్పంచ్ జున్ను రాజేందర్, ముఖీసీర్ అలీ నేహాల్, ఇర్షాద్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్, జిల్లా, మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రష్యాలో యూపీ ఇంజినీర్ అరెస్ట్

మాస్కో: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ ఇంజినీర్‌ను రష్యా పోలీసులు అదుపులోకి తీసుకోవడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. తన భర్తను బలవంతంగా రష్యా సైన్యంలో చేరమని అక్కడి అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆయన భార్య ఆరోపించారు. ఈ ఘటనపై మాస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. కాన్పూర్‌కు చెందిన చందన్ గుప్తా కొన్నేళ్ల క్రితం ఒక ప్రైవేట్ కంపెనీ తరపున వర్క్ వీసాపై రష్యా వెళ్లారు. ప్రస్తుతం ఆయన మాస్కోలో తన భార్య స్నేహ, పదేళ్ల కుమారుడితో కలిసి నివసిస్తున్నారు. అయితే, ఇటీవల స్థానిక పోలీసులు చందన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనకు రష్యన్ భాష రాకపోవడంతో తన భర్తను ఏ కారణంతో అరెస్ట్ చేశారో స్పష్టంగా తెలియడం లేదని స్నేహ ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా సైన్యంలో సిబ్బంది కొరత కారణంగా విదేశీయులను బలవంతంగా బలగాల్లో చేర్చుకుంటున్నారని, అందులో భాగంగానే తన భర్తపై ఒత్తిడి తెస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబాన్ని సురక్షితంగా భారత్‌కు రప్పించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లకు విజ్ఞప్తి చేస్తూ స్నేహ సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్పందించిన మాస్కోలోని భారత రాయబార కార్యాలయం, ఈ అంశాన్ని ఇప్పటికే స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, చందన్ గుప్తా కుటుంబంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని స్పష్టం చేసింది.

## వడ్డీ భారం తగ్గించిన హెచ్‌డీఎఫ్‌సీ

**ఎంసీఎల్ఆర్ రేట్లలో 10 బేసిస్ పాయింట్ల కోత**

**గృహ, వాహన, వ్యక్తిగత రుణాల ఈఎంఐలు తగ్గే చాన్స్**

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ కస్టమర్లకు శుభవార్త అందించింది. 'మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు' (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్ల (0.10%) వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త వడ్డీ రేట్లు ఈరోజు నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని బ్యాంక్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానమైన గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారికి ప్రయోజనం చేకూరనుంది. వారి నెలవారీ వాయిదాలు (ఈఎంఐ) లేదా వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంతో వివిధ కాలపరిమితులపై వడ్డీ రేట్లు మారాయి. గతంలో 8.00% నుంచి 8.65% మధ్య ఉన్న ఎంసీఎల్ఆర్, తాజా తగ్గింపు తర్వాత 7.90% నుంచి 8.60% శ్రేణికి చేరింది.

# చేపలను తాకకుండా ఫోన్‌తోనే కొలతలు

**సీఎమ్ఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ**



న్యూఢిల్లీ: చేపల పరిమాణాన్ని కొలిచేందుకు ఇప్పుడు వాటిని చేతులతో పట్టుకోవాల్సిన అవసరం లేదు. కేవలం స్మార్ట్‌ఫోన్ కెమెరాను చేప వైపు చూపిస్తే చాలు, దాని పొడవు, వెడల్పు వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయి. ఈ వినూత్న సాంకేతికతను ఐకార్-సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. 'మత్స్యమెట్రి' పేరుతో రూపొందించిన ఈ మొబైల్ అప్లికేషన్, మత్స్య పరిశోధన రంగంలో డేటా సేకరణను మరింత సులభతరం చేయనుంది. ప్రస్తుతం పరిశోధకులు, ఫీల్డ్ బృందాలు చేపల కొలతలను సేకరించాలంటే ప్రతి చేపను చేతితో పట్టుకుని మాన్యువల్‌గా కొలవాల్సి వస్తోంది. ముఖ్యంగా వందల సంఖ్యలో చేపలను పరిశీలించాల్సి వచ్చినప్పుడు ఇది చాలా సమయంతో కూడుకున్న పని. ఈ శ్రమను తగ్గించేందుకే 'మత్స్యమెట్రి' యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ సహాయంతో ఒకేసారి ఒకే జాతికి చెందిన అనేక చేపల కొలతలను సులభంగా నమోదు చేయవచ్చు. ఈ యాప్‌ను ఉపయోగించడం కూడా చాలా సులభం. యూజర్ ముందుగా తమ స్మార్ట్‌ఫోన్‌లో శాంప్లింగ్ సెషన్‌ను ప్రారంభించి, కెమెరాను సమతలంగా ఉన్న ప్రదేశంపైకి గురిపెట్టాలి. ఆ తర్వాత చేపను కెమెరా వ్యూలోకి తీసుకురావాలి. యాప్ ఆ ప్రదేశాన్ని గుర్తించి, తెరపై ఒక కొలత గ్రిడ్‌ను చూపిస్తుంది. ఆ తర్వాత చిత్రంలోని చేప పొడవు, వెడల్పును అంచనా వేసి ఆటోమేటిక్‌గా రికార్డు చేస్తుంది. ~ా=జశీీవ టెక్నాలజీకి సపోర్ట్ చేసే ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లలో ఈ యాప్ పనిచేస్తుంది. ఈ యాప్ ద్వారా సేకరించిన పొడవు ఆధారిత డేటా, ఒక ప్రాంతంలోని చేపల పరిమాణం, వాటి జనాభా నిర్మాణం వంటి కీలక విషయాలను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చేపల నిల్వల అంచనా, జనాభా అధ్యయనాలు, మత్స్య వనరుల పర్యవేక్షణలో ఈ సమాచారం కీలక పాత్ర పోషిస్తుంది. సేకరించిన ఫోటోలు, కొలతలను యాప్‌లో భద్రపరచడంతో పాటు, తదుపరి విశ్లేషణ కోసం సీయస్‌వీ ఫైల్‌గా ఎక్స్‌పోర్ట్ చేసుకునే సౌకర్యం కూడా ఉంది. ఈ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసిన సీఎమ్ఎఫ్ఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్డో వర్గీస్ మాట్లాడుతూ.. జీవ సంబంధిత డేటా సేకరణను సులభతరం చేసి, మత్స్య రంగానికి సంబంధించిన సమాచారాన్ని మరింత క్రమపద్ధతిలో రూపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. సీఎమ్ఆర్ఎఫ్ఐ డైరెక్టర్ డాక్టర్ గ్రిన్‌సన్ జార్జ్ మాట్లాడుతూ, ఈ యాప్ డేటా సేకరణను సులభతరం చేస్తుందని, ఇది ప్రధానంగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఫీల్డ్ సర్వే బృందాల కోసం ఉద్దేశించబడినదని వివరించారు. ఐకార్-నేషనల్ ఫెలో ప్రాజెక్ట్ కింద ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ కొత్త సాంకేతికతతో పరిశోధకులు తక్కువ శ్రమతో, వేగంగా, చేపలను పదేపదే తాకాల్సిన అవసరం లేకుండానే విస్తృతమైన డేటాను సేకరించగలరు.

## నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా?

**ఆరావళి కమిటీకి సీజేఐ చురకలు.. కమిటీ పనితీరుపై తీవ్ర అసహనం**

న్యూఢిల్లీ: ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, పరిరక్షణపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్ పీసీ) పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. తుది నివేదిక సమర్పణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు కావాలని కమిటీ కోరడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం, నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించి తీరాలని సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువును పొడిగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీ కోరిన గడువు (2027 ఫిబ్రవరి 28) తన పదవీ విరమణ తేదీ తర్వాత ఉందని సీజేఐ చురక అంటించారు. "కమిటీ ప్రాథమికంగా నా పదవీ విరమణ వరకు వాయిదా కోరినట్లుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి గడువులోగా నివేదికను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించడంలో విఫలమైతే, కమిటీని పునర్వ్యవస్థీకరించే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ, మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని తెలిపారు. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన సంఘాలతో సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా తీసుకోవడానికి అదనపు సమయం అవసరమని కోరారు. అయితే, ఆరు నెలల గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు, కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చింది. నివేదికను ఖరారు చేసే ముందు అన్ని వర్గాలతో సమర్థవంతంగా సంప్రదింపులు జరపాలని కమిటీకి సూచించింది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది జూన్‌లో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ) డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని ఈ కమిటీ వాస్తవానికి ఆగస్టు 31 నాటికే నివేదిక ఇవ్వాల్సి ఉంది. పర్వత శ్రేణిగా గుర్తించాలంటే కనీసం 100 మీటర్ల ఎత్తు ఉండాలన్న నిబంధన వల్ల పర్యావరణపరంగా కీలకమైన ప్రాంతాలు పరిరక్షణ చట్రం నుంచి బయటకు వెళ్లే ప్రమాదం ఉందని గతంలో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక కీలకంగా మారింది. ఈ కేసులో తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

## సిలిండర్ రీఫిల్..
## 25 రోజులకు కుదింపు

న్యూఢిల్లీ: వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## సెన్సెక్స్ 382 పాయింట్లు పతనం

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750-23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

# మహా అష్టమి రోజున లిక్కర్ బంద్

**పశ్చిమ బెంగాల్ సర్కార్ కీలక నిర్ణయం**



కోల్‌కతా: దుర్గా పూజ వేడుకల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పండగలో అత్యంత పవిత్రమైన రోజైన మహా అష్టమి నాడు రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మద్యం నిషేధాన్ని విధిస్తున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. ఆ రోజున భక్తులు దుర్గాదేవికి అత్యంత భక్తిశ్రద్ధలతో పుష్పాంజలి సమర్పిస్తారని, ఆ పవిత్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 19న మహా అష్టమి పర్వదినం జరగనుంది. సోమవారం కోల్‌కతాలోని మిలన్ మేళా ప్రాంగణంలో దుర్గా పూజ కమిటీలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. "మహా అష్టమి రోజున రాష్ట్రంవ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు, బార్లను మూసివేయాలి. ఆ రోజున మద్యం విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. దుర్గా పూజ ఉత్సవాల్లో భాగంగా మహా అష్టమి నాడు మద్యంపై నిషేధం విధించడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. అదే సమావేశంలో సీఎం మరికొన్ని కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఆర్థిక సహాయం అవసరమైన దుర్గా పూజ కమిటీలకు రూ.1 లక్ష చొప్పున గ్రాంటు మంజూరు చేస్తామని తెలిపారు. వీటితో పాటు ఉత్సవాల కోసం ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు, ఫైర్ సేఫ్టీ లైసెన్సుల ఫీజును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఆర్థికంగా బలంగా ఉండి, పెద్ద మొత్తంలో నిధులు కలిగిన కమిటీలు స్వచ్ఛందంగా ఈ గ్రాంటును వదులుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విగ్రహాల నిమజ్జన ఊరేగింపులో డీజే మ్యూజిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అక్టోబర్ 25న లక్ష్మీ పూజ ఉన్నందున, అంతకు ముందే నిమజ్జన ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. మతపరమైన మనోభావాలను కించపరిచే విధంగా పండళ్లు, థీమ్‌లు ఉండకూడదని ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వం రెడ్ రోడ్‌లో ఘనంగా నిర్వహించిన పోస్ట్-పూజ కార్నివాల్‌ను కూడా ఈ ఏడాది నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.



## కుబేరులపై పైసల వర్షం

**15.1 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిక**

**ఏఐ పెట్టుబడులతో భారీగా పెరిగిన ఆస్తులు**

**3,795కి ఎగబాకిన బిలియనీర్ల సంఖ్య**

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తడంతో ప్రపంచ కుబేరుల సంపద సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 నాటికి బిలియనీర్ల మొత్తం ఆస్తి 15.1 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ 'అల్ట్రాటా' తన 'బిలియనీర్ సెన్సస్ 2026' నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగి 3,795కి చేరగా, వారి సంపద 12.8 శాతం మేర వృద్ధి చెందింది. గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. ముఖ్యంగా ఏఐ రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిన కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరగడమే ఈ సంపద వృద్ధికి ప్రధాన కారణమని 'అల్ట్రాటా' నివేదిక స్పష్టం చేసింది. సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులు, ప్రధాన వాటాదారులు అత్యధికంగా లాభపడ్డారు. ఈ నివేదిక ప్రకారం, సంపద కేంద్రీకరణ కూడా తీవ్రస్థాయిలో ఉంది. 50 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తి ఉన్న 29 మంది 'సూపర్ బిలియనీర్లు' చేతిలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద కేంద్రీకృతమై ఉంది. ఇది మొత్తం బిలియనీర్ల ఆస్తిలో దాదాపు 27 శాతానికి సమానం. ప్రాంతాల వారీగా చూస్తే, 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత యూరప్ (1,081), ఆసియా (881) ఉన్నాయి. అయితే, ఈ సంపదలో అధిక భాగం స్టాక్ మార్కెట్ విలువలతో ముడిపడి ఉన్నందున, 'ఏఐ'పై సెంటిమెంట్ మారితే ఇందులో హెచ్చుతగ్గులు ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అగ్నిపర్వతం బద్ధలు.. ఆగిన విమానాలు

**చిక్కుకుపోయిన 1.70లక్షల మంది ప్రయాణికులు**

జావా: ఇండోనేషియాలోని అనక్ క్రకటోవా అగ్ని పర్వతం బద్ధలైంది. భారీగా లావా, బూడిదను వెదజల్లుతున్నది. బూడిద మేఘాలు జావా వైపు 20వేల అడుగుల ఎత్తుకు, సుమత్రా వైపు ఏకంగా 50వేల అడుగుల ఎత్తుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో విమాన రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశంలోని ప్రధాన విమానాశ్రయం అయిన జకార్తా ఎయిర్‌పోర్ట్ సహా ఏడు విమానాశ్రయాలను అధికారులు మూసివేశారు. మొత్తం 1558 విమానాలను రద్దు చేశారు. దీంతో ఆయా విమానాశ్రయాల్లో సుమారు 1.70 లక్షల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. జావా, సుమత్రా ద్వీపాల మధ్య ఉన్న సుండా జల సంధిలో ఉన్న ఈ అగ్ని పర్వతం ఆదివారం తెల్లవారుజామున 3.53కి 30 సెకండ్ల పాటు విస్ఫోటం చెందింది. లావా, విస్ఫోటన శబ్దాలు కొన్ని వందల కిలమీటర్ల వరకు వినిపించాయని అధికారులు వెల్లడించారు. 50వేల అడుగుల ఎత్తుకు బూడిద మేఘాలు చేరుకున్నాయని ఇండోనేషియా వాతావరణ సంస్థ తెలిపింది. అగ్ని పర్వతానికి కనీసం 3 కిలోమీటర్ల దూరం వరకు సందర్శకులెవరూ వెళ్లొద్దని హెచ్చరించింది. బూడిద తీవ్రత కారణంగా శ్వాసకోశ, కళ్లు, చర్మ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉండటంతో.. ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించింది. జకార్తాలోని సోకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయ పరిసరాలతోపాటు జకార్తా, లంపంగ్ ప్రావిన్స్‌లలోని పలు ప్రాంతాల్లో అగ్ని పర్వతం బూడిదను గుర్తించారు. విస్ఫోటం కారణంగా రెండు బూడిద మేఘాలు ఏర్పడినట్టు తెలియజేసింది.

## ఫిబ్రవరి-మార్చిలో 5 రాష్ట్రాల ఎన్నికలు!

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను వచ్చే సంవత్సరం ఫిబ్రవరి-మార్చిలో నిర్వహించే అవకాశం ఉన్నట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా పేర్కొన్నది. యూపీ, ఉత్తరాఖండ్‌లోని మంచు కురవని ప్రాంతాలు, పంజాబ్, గోవాలో జన గణనను ముందుగా జరుపాలని నిర్ణయించిన తర్వాత ఈ రాష్ట్రాల ఎన్నికల నిర్వహణపై ఈసీ నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తున్నది. మణిపూర్ అసెంబ్లీ కాల పరిమితి 2027 మార్చి 13న ముగుస్తుంది.

## కొత్తగా మారుతి బాలెనో
## తొలిసారిగా ఏడీఏఎస్ సేఫ్టీ

ముంబై: భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌లలో ఒకటైన మారుతి సుజుకి బాలెనో, సరికొత్త హంగులతో 2026 ఫేస్‌లిఫ్ట్ మోడల్‌గా మార్కెట్లోకి వచ్చేసింది.



ఆకర్షణీయమైన డిజైన్ మార్పులు, అత్యాధునిక సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన మైలేజ్‌తో విడుదలైన ఈ కారు ప్రారంభ ధరను రూ. 6.09 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఉన్న నెక్సా షోరూమ్‌లలో రూ. 11,000 చెల్లించి ఈ కొత్త బాలెనోను బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త బాలెనోలో ప్రధానంగా ముందు భాగంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రీడిజైన్ చేసిన వైడర్ నెక్స్‌వేవ్ గ్రిల్, కొత్త బంపర్, క్రోమ్ ఫినిషింగ్‌తో కూడిన ఫెండర్ గార్నిష్, కొత్త ఎల్ఈడీ డీఆర్ఎల్‌యస్ కారుకు తాజా లుక్‌ను అందిస్తున్నాయి. ఎనిగ్మాటిక్ టీల్ అనే కొత్త రంగుతో సహా మొత్తం ఏడు రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. లోపలి భాగంలో డ్యూయల్-టోన్ క్యాబిన్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 9-అంగుళాల స్మార్ట్‌ప్లే ప్రో ప్లస్ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ (వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే), ప్రీమియం క్లారియన్ సౌండ్ సిస్టమ్, 360-డిగ్రీ కెమెరా, హెడ్-అప్ డిస్‌ప్లే వంటి ఫీచర్లను జోడించారు. ఈ కొత్త బాలెనోలో భద్రతకు కంపెనీ పెద్దపీట వేసింది. ఈ సెగ్మెంట్‌లో తొలిసారిగా లెవెల్ 2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ ను పరిచయం చేసింది. ఇందులో భాగంగా అడ్వాన్స్‌డ్ ఎమర్జెన్సీ బ్రేకింగ్, లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్ వంటి అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఉన్నాయి. దీనికితోడు, భారత్ ఎన్‌సీఏపీ టెస్టులో 4-స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించడం విశేషం. టాప్ వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, హిల్-హోల్డ్ కంట్రోల్ వంటివి స్టాండర్డ్‌గా వస్తున్నాయి.

లవ్లీ చిత్రం


శ్రియ శరణ్

# బిపాసా బసు రీ ఎంట్రీ!



బాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి బిపాసా బసు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఈ బ్యూటీ.. ఇప్పుడు ఓ విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దాదాపు ఎనిమిదేళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత బిపాసా బసు నటిస్తున్న కొత్త సినిమాపై బాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న పీరియడికల్ క్రైమ్ థ్రిల్లర్ 'బారాబంకి' లో బిపాసా బసు కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. క్రైమ్, డ్రామా అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. అందుతున్న సమాచారం ప్రకారం 'బారాబంకి' కథ 1984లో చోటుచేసుకున్న ఓ యథార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఆ కాలం నాటి పరిస్థితులు, నేర నేపథ్యం, మానవ సంబంధాలను మేళవిస్తూ హన్సల్ మెహతా ఈ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. పీరియడిక్ బ్యాక్‌డ్రాప్‌లో క్రైమ్, డ్రామాను మిళితం చేస్తూ సినిమాను తెరకెక్కిస్తున్న నేపథ్యంలో.. హన్సల్ మెహతా మార్క్‌లో ఉండే రియలిస్టిక్ మేకింగ్ కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. 'బారాబంకి'లో బిపాసా బసుతో పాటు యువ నటులు సన్నీ కౌశల్, విశాల్ జేత్వా కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ హీరోయిన్ బిపాసా అనుభవంతో పాటు యువ నటుల ఎనర్జీ, హన్సల్ మెహతా విభిన్నమైన టేకింగ్ కలిసి ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతున్నాయి.




# ది ప్యారడైజ్ విడుదల వాయిదా?

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ. 2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం.



# షారుక్ భార్యగా రాణీ ముఖర్జీ!

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న తాజా యాక్షన్ మూవీ 'కింగ్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్‌తో పాటు ఆయన కుమార్తె సుహానా ఖాన్, దీపికా పదుకొణె ప్రాధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కూడా భాగం అయినట్లు బాలీవుడ్ సినీ వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో రాణి ముఖర్జీ కూడా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారట. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఇందులో ఆమెది చిన్న పాత్ర అయినప్పటికీ అవినీతిమయమైన వ్యవస్థల కారణంగా మరణించే షారుఖ్ ఖాన్ భార్య పాత్రలో నటిస్తుందని తెలుస్తుంది. చిన్న పాత్రే అయినప్పటికీ ఈ సినిమాకు ఈమెదే ప్రధాన బలం అని టాక్. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వార్తల్లో నిజం ఎంతవరకు ఉందో తెలియాలంటే దీనిపై అఫీషియల్ అప్డేట్ రావాల్సి ఉంది.



# పాండ్యాతో అమీషా డేటింగ్?

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా క్రికెట్‌తో పాటు తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలతోనూ తరచూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతుంటారు. తాజాగా బాలీవుడ్ నటి అమీషా పటేల్తో హార్దిక్‌కు సంబంధం ఉందంటూ సోషల్ మీడియాలో ఓ రూమర్ వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ గాసిప్‌పై అమీషా పటేల్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల ఓ స్టార్ హోటల్‌లో జరిగిన విందులో అమీషా పటేల్, హార్దిక్ పాండ్యా పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అమీషా తన స్నేహితులకు హార్దిక్‌ను పరిచయం చేస్తూ అతడి భుజంపై చేయి వేసిన ఓ సన్నివేశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ దృశ్యాన్ని ఓ నెటిజన్ ఎక్స్‌లో షేర్ చేస్తూ.. రెడ్డిట్‌లో హార్దిక్, అమీషా గురించి వస్తున్న రూమర్లు నిజమే కావచ్చంటూ కామెంట్ చేశాడు. ఇద్దరి మధ్య ఏదో నడుస్తోందని అనుమానం వ్యక్తం చేయడంతో ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. అయితే సాధారణ స్నేహాన్ని కూడా డేటింగ్‌కు ముడిపెట్టడంపై అమీషా పటేల్ తీవ్రంగా స్పందించారు. తనపై వచ్చిన డేటింగ్ రూమర్‌ను చూసిన అమీషా.. సదరు నెటిజన్ పోస్ట్‌ను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతేకాదు, తనదైన వ్యంగ్యంతో గట్టిగా కౌంటర్ ఇచ్చారు. హార్దిక్ భుజంపై చేయి వేయడాన్ని ప్రేమకు గుర్తుగా చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించేలా ఆమె స్పందించారు. ఒక మహిళ తన స్నేహితుడి భుజంపై చేయి వేయడం కూడా డేటింగ్‌కు సంకేతంగా భావించడం సరికాదని ఆమె తన సమాధానంతో స్పష్టం చేశారు.



# టాలెంట్ సరిపోదు: తాప్సీ

స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను ఇటీవల గాంధారి, అస్సీ వంటి థ్రిల్లర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం ఆమె చేతిలో ఎలాంటి కొత్త ప్రాజెక్ట్స్ లేకపోవడంతో.. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు వివాదాస్పద కామెంట్లతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా, ఇండస్ట్రీలో అవకాశాల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. షారుఖ్ ఖాన్ కాంబినేషన్‌లో వచ్చిన 'డంకీ' లాంటి సక్సెస్ తర్వాత కూడా తనకు కమర్షియల్ సినిమాల్లో ఆశించిన అవకాశాలు రాకపోవడంపై మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలో నటీనటులు ఎవరైనా రీప్లేస్ అయిపోతారని తాప్సీ అభిప్రాయపడ్డారు. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ఎవరైనా చేసేలా ఉంటాయని, వారికి పెద్దగా ప్రాధాన్యం ఉండదని తెలిపారు. అవకాశాలు రావడం అనేది కేవలం నటుల టాలెంట్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ వాల్యూ, పబ్లిసిటీ, ఇండస్ట్రీలో ఉండే పరిచయాలు, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలే పాత్రల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇలాంటి నెట్‌వర్కింగ్ విషయంలో తాను కాస్త వెనుకబడి ఉన్నానని, కేవలం తన టాలెంట్ మాత్రమే తనకు అవకాశాలు తెచ్చిపెడుతుందని తాప్సీ స్పష్టం చేశారు.



# రూ.500 కోట్లు దాటిన స్పైడర్ మ్యాన్

హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' భారత బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశీయంగా రూ. 500 కోట్ల వసూళ్లు సాధించిన తొలి హాలీవుడ్ చిత్రంగా ఈ సినిమా అరుదైన రికార్డును నెలకొల్పింది. ఇప్పటివరకు ఏ హాలీవుడ్ సినిమా కూడా ఈ మైలురాయిని అధిగమించలేకపోవడంతో, ఈ చారిత్రాత్మక విజయం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నిర్మాణంలో, టామ్ హాలండ్ స్పైడర్ మ్యాన్‌గా నటించిన ఈ చిత్రం 2026 జూలై 30న భారీ అంచనాల మధ్య విడుదలైంది.



# రేపు 'రణబాలి'టీజర్ రిలీజ్

టాలీవుడ్ మోస్ట్ పాపులర్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహబంధంలోకి అడుగుపెట్టిన తర్వాత తొలిసారి జంటగా నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'రణబాలి'. 'ట్యాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా బిగ్గెస్ట్ పిరియాడిక్ డ్రామాను టి సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. హాలీవుడ్ లెజెండరీ యాక్టర్ ఆర్నాల్డ్ వోస్లూ ఈ చిత్రంలో ప్రధాన విలన్‌గా నటిస్తుండగా, మ్యూజిక్ డైరెక్టర్స్ అజయ్-అతుల్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 1854 నుండి 1878 మధ్య బ్రిటిష్ పరిపాలనా కాలంలో జరిగిన కొన్ని నమ్మశక్యం కాని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతోంది. ఇందులో విజయ్ దేవరకొండ ఒక పవర్‌ఫుల్ యోధుడి పాత్రలో కనిపించబోతున్నారు. ప్రస్తుతం షూటింగ్ ముగింపు దశకు చేరుకున్న ఈ విజువల్ వండర్ దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే నెల రోజుల్లో సినిమా విడుదల కానుండటంతో ప్రమోషన్ల విషయంలో స్పీడ్ పెంచిన చిత్రబృందం, తాజాగా నెట్టింట ఒక బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. సెప్టెంబర్ 9న 'రణబాలి' టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటిస్తూ.. ఒక పవర్‌ఫుల్ ప్రోమో వీడియోను వదిలింది.

## పరుగులే నన్ను కాపాడతాయి: పడిక్కల్



భారత టెస్టు జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే నిరంతరం పరుగులు చేయడమే మార్గమని యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అన్నాడు. జట్టు విజయాల్లో తన వంతు పాత్ర పోషిస్తూ మంచి ప్రదర్శన కొనసాగిస్తే చోటు గురించి ఆందోళన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశాడు. శ్రీలంక పర్యటనలో పడిక్కల్ సత్తా చాటాడు. వరుసగా రెండు శతకాలు బాదాడు. భారత్ 1-0తో సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును సైతం అందుకున్నాడు. సాయి సుదర్శన్ అందుబాటులో లేకపోవడంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ ఆకట్టుకున్నాడు. తనకు అవకాశం వస్తుందని ముందే తెలియడం ఉత్సాహాన్నిచ్చిందని పడిక్కల్ చెప్పాడు. "అవకాశాలు అంత సులభంగా రావు. వాటి కోసం ఎంతో కష్టపడాలి. అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. సిరీస్ ఆరంభంలోనే ఆడతానని చెప్పడంతో చాలా సంతోషించా. బ్యాటింగ్ పరంగా నా కెరీర్‌లోనే అత్యుత్తమ దశలో ఉన్నానని భావించా" అని జియోస్టార్‌తో చెప్పాడు. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడంపై వచ్చే అంచనాలు, పోలికల గురించి కూడా స్పందించాడు. రాహుల్ ద్రవిడ్, ఛతేశ్వర్ పుజారా వంటి దిగ్గజాలు ఆ స్థానంలో ఆడారని గుర్తు చేశాడు. అయితే వారితో పోల్చుకోవడంపై తాను దృష్టి పెట్టనని స్పష్టం చేశాడు. "ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నానన్నది ముఖ్యం కాదు. జట్టుకు నా వంతు సహకారం అందించడమే లక్ష్యం" అని అన్నాడు.

## పాక్ పర్యటనకు భారత జట్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం!

భారత్, పాకిస్థాన్ మధ్య క్రీడా సంబంధాల పునరుద్ధరణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత క్రీడా బృందాలకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అనుమతించినట్లు వార్తలు వెలువడ్డాయి. 2027లో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న సౌత్ ఏషియన్ ఫెడరేషన్ (శాఫ్) గేమ్స్‌లో భారత క్రీడాకారులు పాల్గొంటారని పాకిస్థాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని, దీంతో భారత బృందం పాకిస్థాన్‌కు వెళ్లనుందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు నిజమైతే, పహల్గాం దాడి తర్వాత భారత క్రీడాకారులు పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టడం ఇదే తొలిసారి అవుతుంది. గతంలో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాల కారణంగా ఇరు దేశాల మధ్య క్రీడా కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయిన విషయం తెలిసిందే.



# ఇషాన్ డబుల్ సెంచరీ

### ఈస్ట్ జోన్ 708 భారీ స్కోరు.. సౌత్ జోన్‌పై ఆధిపత్యం

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. అతనికి కుమార్ కుశాగ్ర (101) శతకంతో జత కలవడంతో, ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ విజయం దిశగా పటిష్ఠమైన పునాది వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్, ఆరంభం నుంచే పరుగుల వరద పారించింది. వికెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించిన సౌత్ జోన్, కొత్త బంతిని తీసుకున్నా ఫలితం లేకపోయింది. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఎండీ నిధీశ్ బౌలింగ్‌ను ఇషాన్ కిషన్ సమర్థంగా ఎదుర్కొని బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మరో ఎండ్‌లో కుశాగ్ర కూడా దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. లంచ్‌కు ముందు కుమార్ కుశాగ్ర తన ఆరో ఫస్ట్‌క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత త్రిపురాణ విజయ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఫైన్ లెగ్ వద్ద ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కుశాగ్ర ఔటైనా ఇషాన్ కిషన్ తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. అలసిపోయిన సౌత్ జోన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని, సులువుగా బౌండరీలు బాదుతూ 270 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. డబుల్ సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడిన ఇషాన్ కిషన్, ట్రిపుల్ సెంచరీ వైపు దూసుకెళ్లాడు. ఈ క్రమంలో కాస్త అలసటకు గురై తాత్కాలికంగా రిటైర్ అయినా, మహ్మద్ షమీ (28) ఔటైన తర్వాత తిరిగి క్రీజులోకి వచ్చాడు. అయితే, మరోవైపు వికెట్లు పడుతుండటంతో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగ్ ఆన్ బౌండరీ వద్ద క్యాచ్ ఔటయ్యాడు. కేవలం 30 పరుగుల తేడాతో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. తన 334 బంతుల ఇన్నింగ్స్‌లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే ఇది 8వ అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం. చివరకు ఈస్ట్ జోన్ 163 ఓవర్లలో 708 పరుగులకు ఆలౌట్ అయింది. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురాణ విజయ్ 4 వికెట్లు పడగొట్టగా, చామ మిలింద్ 2 వికెట్లు తీశాడు. ఈ భారీ స్కోరుతో ఈస్ట్ జోన్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.



## ఇంగ్లండ్ జట్టు మెంటార్‌గా పీటర్సన్

ఇటీవల టెస్టు జట్టుకు కొత్త కోచ్ నియామకం చేపట్టిన ఇంగ్లండ్ వేల్స్ బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్‌కు మెంటర్‌గా బాధ్యతలు అప్పగించింది ఈసీబీ. తమ వైట్ బాల్ జట్టుకు పీటర్సన్ స్పెషలిస్ట్ మెంటర్‌గా కొనసాగుతుడని వెల్లడించింది. 12 ఏళ్ల క్రితం అనూహ్య పరిణామాల మధ్య అంతతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ వెటరన్ మళ్లీ జాతీయ జట్టుకు సేవలందించనున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కోసం సన్నద్ధమవుతున్న ఇంగ్లండ్‌కు కెవిన్ పీటర్సన్ కీలక సేవలు అందించనున్నాడు. మాజీ కెప్టెన్ అయిన పీటర్సన్ వన్డే, టీ20 జట్లకు స్పెషలిస్ట్ మెంటర్‌గా వ్యవహరించనున్నాడు. సోమవారం ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అతడికి ఈ బాధ్యతలు అప్పగించింది. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వేలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వన్డే వరల్డ్‌కప్‌లో పీటర్సన్ సేవలు ఇంగ్లండ్‌కు కీలకం అవుతాయని బోర్డు వెల్లడించింది. 'చిన్నప్పుడు దక్షిణాఫ్రికాలో పెరిగినందుకు పీటర్సన్‌కు అక్కడి వాతావరణం బాగా తెలుసు. అందుకని వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగానే అతడిని ఇంగ్లండ్ జట్టుకు స్పెషలిస్ట్ మెంటర్‌గా నియమించాం' అని సోమవారం ఈసీబీ పేర్కొంది.





## మెస్సీ సన్.. మతేయో అదుర్స్

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ కొడుకు మతేయో మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇంటర్ మియామీ అకాడమీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అతడు నేపుల్స్ కప్ టైటిల్‌ను అందించాడు. త్వరలో 11వ పుట్టినరోజు జరుపుకోబోతున్న మతేయో.. చిన్న వయసులోనే తన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. నేపుల్స్ కప్ ఫైనల్‌లో ఇంటర్ మియామీ అకాడమీ విజయం సాధించింది. టైటిల్ గెలిచిన తర్వాత మతేయో ట్రోఫీతో ఫొటోలకు పోజిచ్చాడు. 'ఛాంపియన్' అని రాసి ఉన్న కప్‌ను చేతిలో పట్టుకుని చిరునవ్వులు చిందించాడు. స్పానిష్ పత్రిక 'మార్కా' ఈ వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంది. మెస్సీకి ముగ్గురు కుమారులు. మతేయో రెండో కుమారుడు. సెప్టెంబర్ 11న అతడు 11వ పుట్టినరోజు జరుపుకోనున్నాడు. పెద్ద కుమారుడు థియాగో వయసు 13 ఏళ్లు. చిన్న కుమారుడు సిరోకు 8 ఏళ్లు. మతేయో విజయంపై మెస్సీ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. తండ్రి బాటలోనే ఫుట్‌బాల్‌లో ముందుకు సాగుతున్నాడంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. అర్జెంటీనా జాతీయ జట్టుతో తన 21 ఏళ్ల ప్రస్థానానికి మెస్సీ ఇటీవల ముగింపు పలికిన విషయం తెలిసిందే.






## పాక్ కెప్టెన్ అతి.. ఫీజులో కోత

మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు దెబ్బకు చిత్తుగా ఓడిన పాకిస్థాన్‌కు మరో షాక్ తగిలింది. పాక్ కెప్టెన్ ఫాతిమా సనాకు అంతర్జాతీయ క్రికెట్ మండలి మ్యాచ్ ఫీజులో కోత విధించింది. టీమిండియాతో మ్యాచ్‌లో ఐసీసీ నియమావళిని సనా ఉల్లంఘిచండమే అందుకు కారణం. సెప్టెంబర్ 5 శనివారం భారత జట్టు ఓపెనర్ షఫాలీ వర్మను ఔట్ చేసిన ఆమె.. ఆవేశంగా పెవిలియన్ అదుగో అంటూ చేతితో సంజ్ఞ చేసింది. దాంతో.. ఐసీసీ సనాకు శిక్ష వేసింది. దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్‌లో 55కే ఆలౌటైన పాకిస్థాన్‌కు ఐసీసీ షాకిచ్చింది. భారత జట్టుతో మ్యాచ్‌లో హద్దు మీరి ప్రవర్తించిన పాక్ కెప్టెన్ ఫాతిమా సనాకు జరిమానా విధించింది. సెప్టెంబర్ 5 శనివారం టీమిండియాతో మ్యాచ్‌లో ఐసీసీ నియమ నిబంధనలను ఆమె ఉల్లంఘించింది. ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన ఓపెనర్ షఫాలీ వర్మను రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేసిన అనంతరం.. ఫాతిమా నోరు పారేసుకుంది. షఫాలీ వైపు కోపంగా చూస్తూ.. అదిగో పెవిలియన్ అటు అనే అర్థం వచ్చేలా చేతితో సంజ్ఞ చేసింది. భారత ఓపెనర్‌ను రెచ్చగొట్టేలా ఆమె ప్రవర్తించిన తీరును మ్యాచ్ రిఫరీ సుప్రియా రాణి దాస్ తీవ్రంగా పరిగణించింది.

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# గుజరాత్‌లో బీజేపీ 'ఈవెంట్' మేనేజ్‌మెంట్?

దేశం అంటే ఒక్క ఢిల్లీ కాదు.. ఒక్క గుజరాత్ కాదు.. ఒక్క హైదరాబాద్ కాదు.. ఒక్క ముంబై కాదు. 140 కోట్లకు పైగా ప్రజలతో, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు, భిన్న ప్రాంతీయ ఆకాంక్షలతో కూడిన సమాఖ్య భారతదేశం. అలాంటి దేశంలో జాతీయ స్థాయి కార్యక్రమాలు, ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీలు, సాంస్కృతిక ఉత్సవాలు అన్ని ఒకే ప్రాంతం చుట్టూ తిరుగుతుంటే సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది.. ఇదేనా సమాఖ్య స్ఫూర్తి? ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌లు.. ఐపీఎల్ కీలక మ్యాచ్‌లు.. అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలు.. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం.. తాజాగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం కూడా గుజరాత్‌లో! ఒక్కో నిర్ణయాన్ని విడివిడిగా చూస్తే ప్రతి దానికీ ఒక కారణం ఉండొచ్చు. మౌలిక వసతులు ఉన్నాయి.. భారీ స్టేడియం ఉంది.. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు ఉన్నాయి.. పర్యాటక ప్రాధాన్యం ఉంది.. భద్రతా ఏర్పాట్లు సులభం.. ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుంది.. ఇలా ఎన్నో సమర్థనలు వినిపించవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రతి నిర్ణయాన్ని విడిగా చూడటం కంటే.. నిర్ణయాలన్నింటి కలయికను చూడటం ముఖ్యం. అక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. ఒక రాష్ట్రంలో భారీ మౌలిక వసతులు ఉంటే అక్కడ జాతీయ కార్యక్రమాలు రావడం తప్పు కాదు. ఒక రాష్ట్రం వాటిని సమర్థంగా నిర్వహించగలిగితే ఆ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడమూ తప్పు కాదు. కానీ దేశంలోని మిగిలిన రాష్ట్రాలు కేవలం ప్రేక్షకులుగా మిగిలిపోతే మాత్రం అది ఆరోగ్యకరమైన సమాఖ్య వ్యవస్థకు సంకేతం కాదు. భారతదేశం అంటే ప్రాంతాల సమాహారం. భారతదేశం అంటే అవకాశాల సమాన పంపిణీ. భారతదేశం అంటే అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం. జాతీయ కార్యక్రమాలకు ఆతిథ్యం ఇవ్వడం కేవలం ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం కాదు. దానితో పాటు వేల కోట్ల ఆర్థిక కార్యకలాపాలు వస్తాయి. పర్యాటకం పెరుగుతుంది. హోటళ్లు, రవాణా, చిన్న వ్యాపారాలు, మీడియా, ప్రకటనలు, నిర్మాణ రంగం, సేవా రంగాలకు ఉపాధి అవకాశాలు వస్తాయి. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు ఏర్పడతాయి. ఒక నగరానికి దేశవ్యాప్త గుర్తింపు వస్తుంది. అందుకే ఇలాంటి అవకాశాలు ఒకే రాష్ట్రానికి పదేపదే చేరడం మిగిలిన రాష్ట్రాల అభివృద్ధి అవకాశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ఇక్కడ తెలంగాణను చూడండి. హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతులు ఉన్నాయి. ఉప్పల్ స్టేడియం ఉంది. గచ్చిబౌలి క్రీడా సముదాయం ఉంది. అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. ఐటీ, హోటల్, రవాణా రంగాల్లో ప్రపంచస్థాయి సామర్థ్యం ఉంది. అయినా జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాల విషయంలో హైదరాబాద్‌కు దక్కాల్సిన ప్రాధాన్యం ఎంత? అదే ప్రశ్న బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, భువనేశ్వర్, కొచ్చి, పుణె, లక్నో, జైపూర్, విశాఖపట్నం వంటి నగరాలకూ వర్తిస్తుంది. దేశమంతా ప్రతిభను పెంచుకోవాలి. దేశమంతా మౌలిక వసతులను అభివృద్ధి చేసుకోవాలి. దేశమంతా జాతీయ వేదికలను పంచుకోవాలి. ఒకే ప్రాంతాన్ని వరుసగా ఎంపిక చేస్తూ మిగిలిన ప్రాంతాలకు "మీ దగ్గర సౌకర్యాలు లేవు.. మీరు సిద్ధంగా లేరు" అని చెప్పడం సులభం. కానీ సౌకర్యాలు ఎక్కడ ఏర్పడతాయి? పెట్టుబడులు ఎక్కడికి వస్తాయి? కేంద్ర సంస్థలు ఎక్కడికి వెళ్తాయి? జాతీయ కార్యక్రమాలు ఎక్కడ జరుగుతాయి? అనే అంశాలే ఒక ప్రాంత అభివృద్ధి వేగాన్ని నిర్ణయిస్తాయి. అవకాశం ఉన్న చోట కార్యక్రమం జరగడం ఒక విషయం. అవకాశాలే ఒకే చోట కేంద్రీకృతం కావడం మరో విషయం. ఈ రెండింటి మధ్య తేడాను పాలకులు గుర్తించాలి. జాతీయ స్థాయి సంస్థలు, క్రీడా సమాఖ్యలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు తీసుకునే నిర్ణయాల్లో పారదర్శక ప్రమాణాలు ఉండాలి. ఒక కార్యక్రమానికి ఒక నగరాన్ని ఎంపిక చేయడానికి ఏ ప్రమాణాలు పాటించారో ప్రజలకు తెలియాలి. మౌలిక వసతులు, సామర్థ్యం, ఆతిథ్య అనుభవం వంటి అంశాలతో పాటు ప్రాంతీయ సమతుల్యతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. లేకపోతే "దేశం మొత్తం అభివృద్ధి" అనే మాట కాగితాలపైనే మిగిలిపోతుంది. ఇది గుజరాత్‌పై వ్యతిరేకత కాదు. గుజరాత్ అభివృద్ధి చెందకూడదని ఎవరూ అనడం లేదు. అహ్మదాబాద్ ప్రపంచస్థాయి క్రీడా నగరంగా ఎదగడం దేశానికే గర్వకారణం. అక్కడ భారీ కార్యక్రమాలు జరగడం కూడా స్వాగతించాల్సిందే. కానీ గుజరాత్ ఎదగాలి కాబట్టి తెలంగాణ వెనుకబడాల్సిన అవసరం లేదు. అహ్మదాబాద్ వెలగాలి కాబట్టి హైదరాబాద్ చీకట్లో ఉండాల్సిన అవసరం లేదు. ఒక రాష్ట్రానికి దక్కిన అవకాశం మరొక రాష్ట్రానికి నిరాకరణ కావాల్సిన అవసరం లేదు. సమాఖ్య స్ఫూర్తి అంటే ఇదే. కేంద్రం అంటే కేవలం అధికారాల కేంద్రం కాదు.. అవకాశాలను సమానంగా పంచే కేంద్రం. జాతీయ కార్యక్రమాలు ఢిల్లీలోనే జరగాలని కూడా కాదు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు, వివిధ నగరాలకు వాటిని తీసుకెళ్లడం నిజానికి మరింత ప్రజాస్వామికమైన విధానం. కానీ ఢిల్లీ నుంచి బయటకు వచ్చిన కార్యక్రమాలు ఒకే రాష్ట్రానికి వరుసగా చేరితే అది వికేంద్రీకరణ కాదు.. కొత్త కేంద్రీకరణ. రేపు ఒలింపిక్స్ కోసం భారతదేశం ప్రయత్నిస్తే.. ఏ నగరం? అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలు వస్తే.. ఏ రాష్ట్రం? ప్రపంచస్థాయి సాంస్కృతిక ఉత్సవాలు వస్తే.. ఏ ప్రాంతం? జాతీయ పురస్కారాల కార్యక్రమాలు ఉంటే.. ఏ నగరం? ఈ ప్రశ్నలకు సమాధానం ప్రతిసారీ ఒకే భౌగోళిక ప్రాంతం వైపు చూపిస్తే, దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో అసంతృప్తి పెరగడం సహజం. భారతదేశ అభివృద్ధి ఒక రాష్ట్రం విజయం కాదు. అన్ని రాష్ట్రాల సమిష్టి విజయం. అందుకే ఇకపై జాతీయ కార్యక్రమాల విషయంలో ఒక కొత్త విధానం అవసరం. ప్రతి రాష్ట్రానికి అవకాశాలు కల్పించే రొటేషన్ విధానం ఉండాలి. మౌలిక వసతులు లేని రాష్ట్రాల్లో కేంద్ర సహకారంతో వాటిని అభివృద్ధి చేయాలి. ఒకసారి కార్యక్రమం నిర్వహించిన నగరానికి వెంటనే మరో భారీ కార్యక్రమం ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు అవకాశం కల్పించాలి. అప్పుడు మాత్రమే "ఒక భారత్.. శ్రేష్ఠ భారత్" అనే నినాదానికి నిజమైన అర్థం వస్తుంది. లేకపోతే దేశం ఒక్కటే అయినా.. అవకాశాలు మాత్రం కొన్ని రాష్ట్రాలకే అన్న భావన బలపడుతుంది. ప్రశ్న గుజరాత్‌దే కాదు. ప్రశ్న.. భారతదేశానిది. ప్రశ్న.. సమాఖ్య స్ఫూర్తిది. ప్రశ్న.. సమాన అవకాశాలది. అందుకే అడగాల్సిందే.. అన్నీ అక్కడికే ఎందుకు? దేశం అంతా మనదే కదా!

# పోపుల డబ్బా ఖాళీ!



ద్రవ్యోల్బణం అనే పదం ఆర్థిక శాస్త్రంలో ఒక గణాంకంగా కనిపించినప్పటికీ, సామాన్య కుటుంబానికి మాత్రం అది ప్రతిరోజూ వంటగదిలో కనిపించే వాస్తవ సమస్య. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన ప్రతిసారీ ఆ ప్రభావం నేరుగా కుటుంబ వంటగదిపై పడుతోంది. ఒకప్పుడు నెలకు సరిపడే ఆదాయంతో కుటుంబ అవసరాలను సులభంగా నిర్వహించగలిగిన పరిస్థితి క్రమంగా మారుతోంది. కూరగాయలు, పప్పులు, నూనెలు, చక్కెర, బియ్యం, పిండి, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబ బడ్జెట్‌పై ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాల కుటుంబాలు ఈ ధరల పెరుగుదలను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. వంటగదిలో ద్రవ్యోల్బణం ప్రభావం కేవలం ఖర్చు పెరగడానికే పరిమితం కావడం లేదు. కుటుంబాల ఆహారపు అలవాట్లు, పోషకాహారం, ఆరోగ్యం, పొదుపు, పిల్లల విద్య, వైద్యం వంటి అనేక అంశాలపై దీని ప్రభావం పడుతోంది. ఆదాయం పెరుగుతున్న వేగం కంటే నిత్యావసర వస్తువుల ధరలు వేగంగా పెరిగితే కుటుంబాల నిజమైన కొనుగోలు శక్తి తగ్గిపోతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

జీతం అదే స్థాయిలో ఉన్నప్పటికీ నెలాఖరుకు చేతిలో మిగిలే డబ్బు తగ్గిపోవడం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ద్రవ్యోల్బణం మొదటగా కనిపించేది కూరగాయల మార్కెట్‌లోనే. టమాటా, ఉల్లి, పచ్చిమిర్చి, ఆకుకూరలు, వంకాయ, బెండకాయ, దొండకాయ వంటి సాధారణ కూరగాయల ధరలు కాలానుగుణంగా పెరుగుతుంటాయి. వర్షాలు, ఎండలు, పంట నష్టం, రవాణా సమస్యలు, నిల్వ సదుపాయాల కొరత, మధ్యవర్తుల ప్రభావం వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీస్తాయి. రైతు పొలంలో తక్కువ ధరకు విక్రయించిన ఉత్పత్తి వినియోగదారుడి వంటగదికి చేరే సమయానికి అనేక రెట్లు పెరిగిపోవడం మన వ్యవసాయ మార్కెట్ వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది. నూనెల ధరల పెరుగుదల కూడా కుటుంబ బడ్జెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వంటనూనె ప్రతి కుటుంబానికి తప్పనిసరి అవసరం. నూనె ధర పెరిగినప్పుడు దాని వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాదు. ఫలితంగా కుటుంబాలు ఇతర ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తుంది. పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు వంటి పోషకాహార పదార్థాల కొనుగోళ్లను తగ్గించడం ద్వారా ఖర్చులను నియంత్రించేందుకు ప్రయత్నించే కుటుంబాలు కూడా ఉన్నాయి. ఇది దీర్ఘకాలంలో పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, శారీరక శ్రమ చేసే వ్యక్తుల పోషకాహార స్థితిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

చక్కెర, బియ్యం, పప్పులు వంటి ప్రాథమిక ఆహార పదార్థాల ధరలు పెరిగినప్పుడు దాని ప్రభావం మరింత విస్తృతంగా ఉంటుంది. ఒక కుటుంబంలో సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటే ఆహార ఖర్చు మరింత పెరుగుతుంది. ముఖ్యంగా స్థిరమైన జీతం లేదా రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలకు ధరల పెరుగుదల పెద్ద ఆర్థిక భారంగా మారుతుంది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు పెరగడం వల్ల అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడవచ్చు. వంటగదిపై ద్రవ్యోల్బణం ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించాలి. ఒక కుటుంబ ఆదాయంలో ఆహారం కోసం ఖర్చు చేసే మొత్తం పెరిగితే విద్య, వైద్యం, ఇల్లు, రవాణా, పిల్లల అవసరాలు, పొదుపు వంటి ఇతర రంగాలకు కేటాయించే డబ్బు తగ్గుతుంది. తక్కువ ఆదాయ కుటుంబాల్లో ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. అధిక ఆదాయం కలిగిన కుటుంబాలు ధరల పెరుగుదలను కొంతవరకు భరించగలిగినా, పేద కుటుంబాలకు ఆహార ధరల పెరుగుదల నేరుగా జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు కుటుంబాలు ముందుగా అనవసర ఖర్చులను తగ్గిస్తాయి. ఆ తర్వాత వినోదం, ప్రయాణాలు, దుస్తులు, గృహోపకరణాల కొనుగోళ్లు వంటి ఖర్చులను వాయిదా వేస్తాయి. పరిస్థితి మరింత తీవ్రమైతే పప్పులు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహార పదార్థాల వినియోగాన్ని కూడా తగ్గించే ప్రమాదం ఉంటుంది. ఇక్కడే ద్రవ్యోల్బణం ఆర్థిక సమస్య నుంచి సామాజిక సమస్యగా మారుతుంది.

ప్రభుత్వం ఆహార ధరలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి. అవసరమైన వస్తువుల నిల్వలు తగిన స్థాయిలో ఉండేలా చూడాలి. కృత్రిమ కొరత సృష్టించే అక్రమ నిల్వలను నియంత్రించాలి. రైతుల నుంచి వినియోగదారుల వరకు సరఫరా గొలుసులో అనవసర మధ్యవర్తిత్వాన్ని తగ్గించాలి. రైతులకు ఉత్పత్తి వ్యయం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రతతో పాటు పోషకాహార భద్రత కూడా సమానంగా ముఖ్యమైనది. ఒక కుటుంబం కడుపు నింపుకోవడం మాత్రమే ఆహార భద్రత కాదు. అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, కొవ్వులు, కార్బోహైడ్రేట్లు సమతుల్యంగా లభించడం కూడా అవసరం. ధరల పెరుగుదల కారణంగా కుటుంబాలు పోషకాహారాన్ని తగ్గించుకుంటే భవిష్యత్తులో ఆరోగ్య వ్యయం పెరిగే అవకాశం ఉంటుంది.

ద్రవ్యోల్బణం అసలు ప్రభావం గణాంకాల్లో కంటే వంటగదిలోనే స్పష్టంగా కనిపిస్తుంది. నెల మొదట్లో నిండుగా ఉన్న సరుకుల సంచి నెలాఖరుకు ఖాళీ కావడం, గతంలో కొనుగోలు చేసిన పరిమాణంలో ఇప్పుడు కొనలేకపోవడం, పిల్లలకు ఇష్టమైన ఆహార పదార్థాలను తగ్గించడం, పొదుపు కోసం కుటుంబ అవసరాలను కుదించుకోవడం వంటి అనుభవాలే సామాన్య ప్రజలకు ద్రవ్యోల్బణం యొక్క నిజమైన రూపం. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రతి కుటుంబం తన వంటగదిలో ఆ అభివృద్ధి ఫలితాన్ని అనుభవించగలిగినప్పుడే నిజమైన ఆర్థిక ప్రగతి సాధించినట్టవుతుంది. వంటగదిపై ధరల భారాన్ని తగ్గించడం అంటే కేవలం ఒక కుటుంబాన్ని ఆదుకోవడం కాదు; దేశంలోని కోట్లాది కుటుంబాల జీవన ప్రమాణాలను, పోషకాహారాన్ని, ఆరోగ్యాన్ని, భవిష్యత్తు భద్రతను కాపాడడం. ద్రవ్యోల్బణాన్ని సాధారణంగా శాతాలు, సూచీలు, ఆర్థిక అంచనాల భాషలో వివరిస్తుంటారు. మొత్తం ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఆహార ధరల ఒత్తిడి మాత్రం రోజువారీ జీవితంలో తీవ్రంగా కనిపించవచ్చు. ఈ ఒత్తిడిని అర్థం చేసుకోవడానికి వంటగదిలో సాధారణంగా ఉపయోగించే మూడు వస్తువులు.. చక్కెర, వంట నూనె, ఉల్లిపాయ.. చాలా ముఖ్యమైన సూచికలుగా నిలుస్తాయి. కుటుంబ వినియోగంలో ఇవి చిన్న భాగమే అయినప్పటికీ, వీటి ధరలు వ్యవసాయం, వాతావరణ పరిస్థితులు, రవాణా, అంతర్జాతీయ మార్కెట్లు, పన్నులు, సరఫరా వ్యవస్థలు, ప్రభుత్వ విధానాలతో సన్నిహితంగా అనుసంధానమై ఉంటాయి.

భారత ఆర్థిక వ్యవస్థలో చక్కెరకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇది ఒకవైపు వ్యవసాయ ఉత్పత్తి కాగా, మరోవైపు పారిశ్రామిక ఉత్పత్తి. కోట్లాది మంది రైతులను చక్కెర కర్మాగారాలు, వ్యాపారులు, శుద్ధి పరిశ్రమలు, వినియోగదారులతో అనుసంధానించే వస్తువుగా చక్కెర నిలుస్తుంది. ఇటీవలి పరిణామాలు చక్కెర ధరల నిర్వహణ ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తున్నాయి. దేశీయంగా చక్కెర లభ్యతను పెంచి, పండుగల కాలానికి ముందు ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ముడి చక్కెర దిగుమతులపై సుంకాన్ని తొలగించింది. అయితే 2026 ఆగస్టులో రాయిటర్స్ నివేదిక ప్రకారం, దేశీయ చక్కెర ధరలు గణనీయంగా పడిపోవడంతో దిగుమతుల లాభదాయకత తగ్గిపోయింది. చక్కెర ధర పెరిగితే స్వీట్లు, బిస్కెట్లు, పానీయాలు, తీపి పదార్థాలు, అనేక గృహ తయారీ వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. పండుగల సమయంలో డిమాండ్ సాధారణంగా పెరిగే కారణంగా ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఆనందంతో ముడిపడిన చక్కెర, ఆర్థిక ఆందోళనకు ప్రతీకగా మారడం ఒక విచిత్రమైన పరిస్థితి. చక్కెర ఆహార ద్రవ్యోల్బణానికి కనిపించే రూపమైతే, వంట నూనె దాని నిశ్శబ్దమైన, కానీ విస్తృతమైన ప్రభావాన్ని సూచిస్తుంది. భారతీయ వంటగదిలో నూనె ప్రతిరోజూ ఉపయోగించే వస్తువు. అందువల్ల దాని ధరలో స్వల్ప పెరుగుదల కూడా నెల రోజుల వ్యవధిలో లేదా ఏడాది కాలంలో కుటుంబంపై గణనీయమైన అదనపు భారాన్ని మోపుతుంది. అంతేకాకుండా వంట నూనెల ధరలు అంతర్జాతీయ వస్తు మార్కెట్లు, మారకపు విలువలు, దిగుమతి వ్యయాలు, దేశీయ నూనెగింజల ఉత్పత్తితో అనుసంధానమై ఉంటాయి. భారతదేశం దిగుమతి చేసుకునే వంట నూనెలపై ఆధారపడటం వల్ల దేశీయ మార్కెట్ అంతర్జాతీయ పరిణామాలకు మరింత సున్నితంగా మారుతుంది. అందుకే ఆహార ద్రవ్యోల్బణాన్ని కేవలం వంటగదికి పరిమితం చేసి చూడకూడదు. ఒక కుటుంబానికి పరిమిత ఆదాయమే ఉంటుంది. కిరాణా బిల్లు పెరిగినా వేతనం అదే స్థాయిలో ఉంటే, మరేదో ఒక ఖర్చును తగ్గించుకోవాల్సిందే. పేద కుటుంబాలకు ఈ పరిస్థితి మరింత కష్టతరంగా ఉంటుంది. ఎందుకంటే వారి మొత్తం ఖర్చులో ఆహారానికి వెళ్లే వాటా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ద్రవ్యోల్బణానికి ఒక సామాజిక కోణం కూడా ఉంది. ధరలు పెరగడం వల్ల మాత్రమే అసమానత పెరగదు; ఆ ధరల పెరుగుదలను భరించే సామర్థ్యం కుటుంబాల మధ్య చాలా భిన్నంగా ఉండటం కూడా అసమానతను పెంచుతుంది. ద్రవ్యోల్బణానికి ఒక్క కారణాన్ని మాత్రమే నిందించడం సాధ్యం కాదు. వాతావరణ పరిస్థితులు వ్యవసాయ ఉత్పత్తిని తగ్గించవచ్చు. ఇంధన ధరలు రవాణా, ఉత్పత్తి వ్యయాలను పెంచవచ్చు. అంతర్జాతీయ వస్తు ధరల మార్పులు దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై ప్రభావం చూపవచ్చు. నిల్వ సదుపాయాల కొరత కాలానుగుణ కొరతకు దారితీయవచ్చు. మధ్యవర్తులు, మార్కెట్‌లోని అసమర్థతలు రైతు వద్ద లభించే ధరకు, వినియోగదారుడు చెల్లించే ధరకు మధ్య అంతరాన్ని పెంచవచ్చు. భయంతో అధికంగా కొనుగోలు చేయడం, ఊహాగానాలు కూడా తాత్కాలిక కొరతను మరింత తీవ్రతరం చేయవచ్చు. భారతీయ రిజర్వు బ్యాంకు కూడా ఇటీవల ఆహారం, ఇంధనం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్ల విస్తృత ద్రవ్యోల్బణ ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని నుంచి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ద్రవ్యోల్బణాన్ని కేవలం తాత్కాలిక ధర నియంత్రణలతో ఎదుర్కోవడం సాధ్యం కాదు. ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెట్ నియంత్రణ, సముచిత ద్రవ్య మరియు ఆర్థిక విధానాలను సమన్వయంతో అమలు చేయాలి.

భారతదేశానికి ఆహార ధరల స్థిరత్వం కోసం దీర్ఘకాలిక వ్యూహం అవసరం. మొదటగా, అనిశ్చిత వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయాలి. మెరుగైన సాగునీటి సదుపాయాలు, వాతావరణాన్ని తట్టుకునే పంటలు, మెరుగైన వ్యవసాయ పద్ధతులు సరఫరా లోటును తగ్గించగలవు. రెండవది, నిల్వ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలి. ఉల్లిపాయ వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు అవసరం. ఇవి పంట కోత అనంతర నష్టాలను తగ్గించడంతో పాటు ధరలు ఒక్కసారిగా పెరిగినప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేసే అవకాశాన్ని కల్పిస్తాయి. మూడవది, సరఫరా వ్యవస్థలను ఆధునీకరించాలి. వేగవంతమైన రవాణా, మెరుగైన మార్కెట్ అనుసంధానం, పారదర్శక ధరల వ్యవస్థ రైతు నుంచి వినియోగదారుడి వరకు ఉండే అనవసర మధ్యవర్తిత్వాన్ని తగ్గించగలవు. నాలుగవది, ప్రభుత్వ నిల్వలు, మార్కెట్ జోక్యాలు సమయానుకూలంగా, సమతుల్యంగా ఉండాలి. తాత్కాలికంగా ధరలను అణచివేయడం మాత్రమే లక్ష్యంగా కాకుండా, ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులను నివారించడంతో పాటు రైతులకు న్యాయమైన ప్రతిఫలం లభించేలా విధానాలు రూపొందించాలి. చివరగా, వినియోగదారులకు ధరలపై మరింత పారదర్శక సమాచారం అందుబాటులో ఉండాలి. పోటీతో కూడిన, సమాచారంతో నడిచే మార్కెట్ అన్యాయమైన ధరల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడుతుంది. ద్రవ్యోల్బణం యొక్క అసలు అర్థం కేవలం ఆర్థిక నివేదికల్లో కనిపించదు. నెలవారీ బడ్జెట్‌ను మౌనంగా మళ్లీ లెక్కించుకునే తల్లిదండ్రుల్లో అది కనిపిస్తుంది. లాభాలను కొనసాగించడానికి ఇబ్బంది పడే చిన్న వ్యాపారిలో కనిపిస్తుంది. ఉత్పత్తి వ్యయాల గురించి ఆందోళన చెందే రైతులో కనిపిస్తుంది. నిత్యావసర వస్తువులు ఎందుకు రోజురోజుకూ ఖరీదవుతున్నాయో ఆలోచించే వినియోగదారుడిలో కనిపిస్తుంది.

చక్కెర, నూనె, ఉల్లిపాయ ఒక్కొక్కటిగా చూసినప్పుడు చిన్న వస్తువులుగా కనిపించవచ్చు. కానీ కోట్లాది కుటుంబాల జీవనంలో ఇవి ఆర్థిక పరిస్థితికి కీలక సూచికలు. ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థ అంటే కేవలం దేశ స్థూల దేశీయోత్పత్తి పెరగడం లేదా స్టాక్ మార్కెట్లు పెరగడం మాత్రమే కాదు. సాధారణ ప్రజలు తదుపరి ధరల షాక్ గురించి నిరంతరం భయపడకుండా నిత్యావసర ఆహారాన్ని కొనుగోలు చేయగలిగే పరిస్థితి కూడా ఉండాలి. అందువల్ల ఆర్థిక ప్రగతికి నిజమైన పరీక్ష దేశం ఎంత ఉత్పత్తి చేస్తుందనే దానితో మాత్రమే నిర్ణయించకూడదు. ఆ దేశ ప్రజలు ఆ ఉత్పత్తి నుంచి లభించే ప్రయోజనాలతో ఎంత భద్రంగా, స్థిరంగా జీవించగలుగుతున్నారనే దానిని కూడా కొలవాలి. ద్రవ్యోల్బణం ప్రభుత్వ లెక్కల పట్టికలో ఒక సంఖ్యగా ప్రారంభం కావచ్చు. కానీ చివరికి అది కుటుంబ భోజనపు బల్లపై ఒక ప్రశ్నగా మారుతుంది.. నిన్న కొనగలిగిన వస్తువును ఈరోజు కూడా ఆ కుటుంబం కొనగలదా? అందుకే చక్కెర, నూనె, ఉల్లిపాయల ధరలు కేవలం వంటగదికి సంబంధించిన అంశాలు కావు. అవి ఆర్థిక భద్రతకు, సామాజిక స్థిరత్వానికి, సాధారణ పౌరుడి కొనుగోలు శక్తికి కొలమానాలు.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.